నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 4వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేద్దాం

- భూసమస్యల పరిష్కారానికి కమిటీ
- జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- కూటమి ప్రభుత్వంలో మొదటి జిల్లా సమీక్షా సమావేశం
- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్

రాయచోటి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషితో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదిక సభాభవనంలో ఆదివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిపై 32వేల కీర్తనలు రాసిన అన్నమాచార్యులు జన్మించిన ఈ జిల్లాకు ఇన్‌చార్జ్ మంత్రిగా నన్ను నియమించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో నాలుగింటిలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించి అధికారం దక్కించుకోవడంలో అన్నమయ్య జిల్లా కీలక పాత్ర పోషిందన్నారు. మొదటిసారి జిల్లాకు వచ్చినప్పటికీ తన మంత్రివర్గ కార్యాలయ సిబ్బందితో, మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కార్యాలయానికి సంబంధించిన భూకుంభకోణం, జాతీయ రహదారుల పనులు, ఉచిత ఇసుక విధానం, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీలో అన్నమయ్య జిల్లా మొదటి మూడు స్థానాల్లో నిలుస్తోందని ఇందుకు జిల్లా అధికార యంత్రాంగాన్ని అభినందిస్తున్నామన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో అన్నమయ్య జిల్లాకు అవార్డులు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మూడు పర్యాయాలు తనను గెలిపించిన జిల్లా ప్రజలు కరువు కాటకాలతో ఇబ్బంది పడుతూ ఉంటే వాళ్ల సమస్యలపైన మాట్లాడాల్సిన రాజంపేట పార్లమెంటు సభ్యుడు మిథున్‌రెడ్డి ఈ సమావేశానికి హాజరు కాకపోవడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల తర్వాత ఇది మంచి ప్రభుత్వం..అనే కార్యక్రమంతో ప్రజల్లోకి వెళితే ప్రజలు నీరాజనం పలికారని అన్నారు.

సమావేశంలో రెవెన్యూ శాఖపై సమీక్షలో వివిధ అంశాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కమిటీకి వివరించారు. జిల్లాలో ఫ్రీ హోల్డ్ రీవెరిఫికేషన్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆరు నియోజకవర్గాలలో 65 వేలకుపైగా ఎకరాలు ఆమోదించినట్లు., 69 వేల 886 ఎకరాలు తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 30 మండలాలకు, 19 మండలాలను కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. దీనిపై పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పీలేరు మండలంలోని కేవీ పల్లె మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించాలని అధికారులను కోరారు. ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్‌లో 69 వేల ఎకరాలు తిరస్కరించినట్లు జిల్లా అధికారులు చెబుతున్నారని, ఈ అక్రమాలకు కారకులైన అధికారులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రామసముద్రం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. మదనపల్లెలో జరిగిన అక్రమ భూముల వ్యవహారాన్ని త్వరగా విచారణ పూర్తి చేసి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేల సూచన ప్రకారం.. మరొకసారి అన్ని మండలాలపై సమీక్షించి ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి మరిన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ జిల్లాలో భూసమస్యలను పరిష్కరించడానికి ఒక నూతన కమిటీని ఏర్పాటు చేసి, పలు భూసమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

138 గ్రామాల్లో రీసర్వే...

జిల్లాలోని 138 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ జరుగుతోందని, 80 గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన 58 గ్రామాల్లో త్వరలో పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ జగనన్న రీసర్వే ద్వారా రైతులకు పంట రుణాలు, డ్రిప్ కూడా రావడం లేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం రీసర్వేను నిలిపేసిందని, దీనివల్ల వన్‌బి, అడంగల్ వంటివి రాక రైతులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పీలేరు నియోజకవర్గంలో 43 గ్రామాల్లో ఈ సర్వే వల్లసమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని మంత్రి తెలిపారు.

పింఛన్ల పంపిణీలో...

పింఛన్ల పంపిణీలో జిల్లా మొదటి మూడు స్థానాల్లో ఉంటుందని తెలిపారు. ఈ అంశంపై పీలేరు, మదనపల్లె, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డిలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలనే పేరుతో అర్హులైన పించనుదారులకు కూడా పించను తీసేశారని, దీనిపై తగిన చర్యలు తీసుకుని వారికి పింఛన్ పునరుద్ధరించాలని కోరారు.

వ్యవసాయశాఖపై...

జిల్లాలోని 6 నియోజకవర్గాల్లో 400 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయని, 2024-25లో అన్నమయ్య జిల్లాలో వర్షాభావం ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 91547 మంది రైతులకు 1,98,331 ఎకరాల్లో ఈకేవైసీ పూర్తయ్యిందన్నారు. జిల్లాలో 13723 మట్టి నమూనాలు సేకరించినట్లు తెలిపారు. జిల్లాలో విత్తనాల పంపిణీలో 21 కోట్ల సబ్సిడీ, ఎరువుల పంపిణీలో 94 కోట్ల రూపాయలు సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు మాట్లాడుతూ నానో ఫర్టిలైజర్స్‌ను ఉపయోగించే విధంగా రైతులకు తగిన శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, ఆకేపాటి మాట్లాడుతూ రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గం ఉద్యానవన పంటలకు ప్రసిద్ధిగాంచిందని, రైతులకు వ్యవసాయ చెరువులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేసి రైతులకు భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

వైద్యఆరోగ్య, విద్యుత్ శాఖ..

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, చుట్టుపక్కల ప్రాంతాల్లో యాక్సిడెంట్ జోన్లు ఎక్కువగా ఉన్నాయని, ముఖ్యంగా రాజంపేట, పీలేరు, తంబళపల్లి నుంచి కూడా ఇక్కడికి ప్రమాద బాధితులు ఎక్కువగా వస్తారని తెలిపారు. రాయచోటి ఏరియా ఆసుపత్రికి ఒక ట్రామా కేర్ కావాలని, డయాలసిస్ యూనిట్ ప్రారం:భించినందుకు మరొక 50 పడకలు అవసరం అవుతాయని, ఆసుపత్రికి శానిటరీ సిబ్బంది అవసరమని తెలిపారు. ఆసుపత్రికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించనందున కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. విద్యుత్ శాఖలో కరెంటు ఆఫీస్‌లకు శాశ్వత ఉద్యోగులు అవసరం ఉందన్నారు. దాదాపు 5 నెలల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రభుత్వంలో గత నాలుగు నెలల కాలంలో సుమారు 130 బోర్లు వేశామని, వాటితో పాటు పాత బోర్లకు కూడా కనెక్షన్లు ఇవ్వాలన్నారు.. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

మిషన్ పాత్ హోల్ ఫ్రీపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 211.56 కిమీల రహదారుల్లో గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. దీనిపై ఎంపీ మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గ పరిధిలో ఇసుక రీచ్‌లు ఉన్నందున వాహనాల తాకిడి ఎక్కువగా ఉండి, రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ గత 2014-19లో రాష్ట్రంలో ఎక్కువ శాతం రోడ్లు వేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానికి దక్కుతుందని, గత ప్రభుత్వ పాలనలో రోడ్లను పట్టించుకోలేదని అన్నారు. రవాణా శాఖపై పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అధిక లోడు పేరుతో లారీ డ్రైవర్ల వద్ద అధికంగా పెనాల్టీలు వసూలు చేస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు.

ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉచిత ఇసుక విధానాన్ని జిల్లాలో పటిష్ఠంగా అమలు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మొదట్లో సీనరేజ్ ఉండేది. ఇప్పుడు దానిని కూడా ముఖ్యమంత్రి తొలగించడం వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుతోందన్నారు. దీనిపై పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఇళ్లకు అవసరమైన ఇసుకను స్థానికంగా ప్రజలు తీసుకెళ్లడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. అదే సమయంలో ఉచిత ఇసుక పక్క రాష్ట్రాలకు తరలివెళ్లకుండా చెక్‌పోస్టుల్లో పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చని, వందశాతం రాష్ట్ర సరిహద్దులు దాటకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో మంత్రులతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదనరావు, ఆర్డీవో శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్ బ్యాంకు

ఓటర్ల జాబితా ప్రదర్శన

- 11న తుది ఓటర్ల జాబితా ప్రచురణ.. 29న పోలింగ్


ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న టౌన్ బ్యాంకు సీఈవో ప్రసాద్


మదనపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె టౌన్ బ్యాంకు ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ, బ్యాంకు సీఈవో పి.వి. ప్రసాద్‌లు ప్రదర్శించారు. స్థానిక ప్రధాన బ్యాంకులో ఆదివారం ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఓటర్లపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వ తేదీలోగా తెలపాలని వారు కోరారు. అనంతరం 11వ తేదీ తుది ఓటర్ల జాబితా ప్రచురణ, 18వ తేదీ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఎన్నికల అధికారి, సీఈవో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 22వ తేదీ నామినేషన్ల స్వీకరణ, 23న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణతో ఎన్నికల బరిలోని తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. అవసరమైతే 29వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పోలింగ్, అదేరోజు 3 గంటల నుంచి ఎన్నికల కౌంటింగ్ అనంతరం విజేతలను ప్రకటించనున్నారు. మొత్తం 12 మంది డైరెక్టర్లతో ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. ఎన్నికల బరిలో ఎంతమంది అభ్యర్థులుంటే అందరికీ ఎన్నికల అధికారి ఎన్నికల గుర్తును కేటాయించనున్నారు. అయితే ఒక్కో ఓటరు 12 మంది అభ్యర్థులకు మాత్రమే, అది కూడా ఒకే బ్యాలెట్‌లో ఓటు వేయాలి, అంతకుమించి 13వ అభ్యర్థికి ఓటు వేసినా అనర్హుడిగా పరిగణించనున్నారు. ఈసారి వైసీపీ నుంచి పోటీ ఉండే అవకాశం లేదని తెలుస్తోంది. టౌన్‌బ్యాంకు ఛైర్మన్ గిరి మరోసారి టీడీపీనే కైవసం కానుంది. ఏడుమందికిపైగా ఎంత మంది ఎన్నికల బరిలో ఉన్నా..వారికి వచ్చిన ఓట్లను ఆధారంగా విజేతను ప్రకటించనున్నారు. కానీ ఏడుగురి కంటే తక్కువ మంది బరిలో ఉంటే ఎన్నిక రద్దు కానుంది. మొత్తమ్మీద తీసుకుంటే బ్యాంకులోని పాత డైరెక్టర్లే మరోసారి ఈ ఎన్నికల్లో చక్రం తిప్పనున్నట్లు స్పష్టమవుతోంది.

రాజంపేట సమస్యలను పరిష్కరించండి

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి జగన్‌మోహన్‌రాజు వినతి

రాజంపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు సోమవారం వినతిపత్రం అందచేశారు. సోమవారం జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశానికి రాయచోటికి వచ్చిన మంత్రిని ఆయన కలిసి రాజంపేట సమస్యలను వివరించారు. ప్రధానంగా అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయాలని, రాజంపేటలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని, రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరారు. అదే విధంగా గాలేరు-నగిరి కాలువను పూర్తి చేసి రైతాంగానికి నీరందించాలని కోరారు. అనంతరం మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


ఇన్‌చార్జ్ మంత్రి జనార్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



ఖజానాలో..

కలెక్షన్ల జోరు

- ప్రతి ఆఫీసులో ఓ మెసెంజర్ ద్వారా వసూళ్లు
- ప్రతి బిల్లుకు ఒక రేటు..
- జిల్లా వ్యాప్తంగా ట్రెజరీ కార్యాలయాల తీరు




రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఖజానా కార్యాలయాల్లో వసూళ్ల దందా నడుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా లో మొత్తం 8 సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఉండగా అందులో నియోజకవర్గాల్లో ఉన్న కార్యాలయాల్లో మామూళ్ల దందా ఒక రేంజ్‌లో నడుస్తోందని ప్రచారం ఉంది. కంటింజెంట్ బిల్లులు, సరెండర్ లీవులు, పెన్షన్లు, జీపీఎఫ్, జీఐఎస్ ఇన్సెంటివ్స్, మెడికల్ బిల్లులు, ఇంక్రిమెంట్ తదితర బిల్లులను ఆదాయ వనరులుగా మార్చుకుని ప్రతి కార్యాలయంలో ఒక మెసెంజర్‌ని పెట్టి వసూళ్లు చేస్తున్నారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నా రు. ఒక్కొక్క బిల్లుకు ఒక్కొక్క రేటు పెట్టి 10 వేల నుంచి 20 వేల రూపాయలు వసూళ్లు చేస్తున్నట్లు ఆ కార్యాలయ సిబ్బంది గుసగుసలాడుతున్నారు. మదనపల్లె, పీలేరు, రాజంపేట, రాయచోటి ప్రాంతాల్లో ఉన్న ఖజానా కార్యాలయాల్లో వందకు పైగా డీడీవో కోడ్‌లు ఉన్నాయి. ఒక్కొక్క ట్రెజరీ నుంచి జిల్లా కార్యాలయానికి ప్రతినెలా మామూళ్లు ఇస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. రాయచోటి సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఇక మామూళ్ల దందా చెప్పనక్కర్లేదు. ఇష్టానుసారం వసూళ్ల కు తెరలేపారని వాదన బలంగా వినపడుతోంది. ఓ ఉద్యోగి చనిపోతే అతడికి రావాల్సిన బకాయిలు గవర్నమెంట్ అతడి నామినీ అయిన భార్యకు వేసింది. అయితే ఇక్కడ పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్ పొరపా టు వల్ల అతడి భార్య అకౌంట్‌కు వేయాల్సిన అమౌంటును చనిపోయిన వారి అకౌంటుపై వేయడం వల్ల ఆమెకు చాలా నష్టం జరిగిందని తెలిసింది. ఏదో ఒక డిపార్టుమెంట్ నుంచి ఎవరో ఒక ఉద్యోగి ఇంక్రిమెంట్ బిల్లులు, సరెండర్ లీవులకు సంబంధించిన డబ్బు లు రావాల్సి ఉంటే అవి చేయడానికి దాదాపు రెండు నెలలు తిప్పించుకొని డబ్బులు ఇచ్చిన తర్వాత బిల్లులు చేశారని తెలిసింది. ఈ విషయాలపై జిల్లా డీటీవో మహబూబ్‌ను వివరణ కోరగా ప్రతి సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఓ మెసెంజర్ ద్వారా వసూళ్లు చేస్తున్నట్లుగా నా దృష్టికి రాలేదు. ఒకవేళ ఏదైనా అలా వసూళ్లు చేస్తున్న వారి వివరాలు చెప్పండి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాను అని చెప్పడం విశేషం.

‘అపార్’ కష్టాలు అపారం

- ఆధార్‌తో అపార్‌కు పీఠముడి
- జిల్లాలో 50.12 శాతమే పూర్తి
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

ఆధార్ సంఖ్య అంటే దేశంలో తెలియని ప్రజలు లేరు. అలాగే విద్యార్థులకు యూనిక్ కోడ్ నెంబర్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నెంబర్ కూడా 12 డిజిట్లతో విద్యార్థులకు ఒక ఐడీ కేటాయిస్తారు. ఒకే దేశం..ఒకే స్టూడెంట్ ఐడీ పేరుతో నూతన జాతీయ విద్యావిధానం-2020 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ అపార్ నెంబర్ కేటాయించడానికి ప్రతి విద్యార్థి పేరు, ఇంటి పేరు, పుట్టినతేదీ తదితర వివరాలను సేకరించి ఆధార్ కార్డు, యు డైస్‌తో సరిపోల్చాక విద్యార్థికి ఐడీ నెంబర్ కేటాయిస్తారు. అలాంటి ప్రక్రియ నేడు ఆధార్ కార్డు నమోదులో జరిగిన పొరపాట్లతో అపార్ నమోదు సరిపోక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.


ఆధార్ వివరాలు సరిపోక అపార్ నమోదులో రిజెక్ట్ అని చూపిస్తున్న దృశ్యం


మదనపల్లె జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు

మదనపల్లె టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1734 ప్రాథమిక పాఠశాలలు, 162 ప్రాథమికోన్నత పాఠశాలలు, 304 ఉన్నత పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 75,435 మంది బాలురు, 79,354 మంది బాలికలు కలిపి మొత్తం 1,54,789 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ అపార్ నెంబర్ కేటాయించాలని జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు వారి తరగతిలోని విద్యార్థులకు ఒకటో తరగతిలో నమోదు చేసిన పేరు ప్రకారం, ఐదో తరగతిలో విద్యార్థికి ఇచ్చే టీసీ ప్రకారం అపార్‌లో ఐడీ క్రియేట్ చేసేందుకు కంప్యూటర్‌లో డేటా ఎక్కిస్తున్నారు. విద్యార్థికి ఒకటో తరగతిలో ఏ పేరుతో నమోదు చేస్తారో, జీవితాంతం అదే పేరుతో అన్ని రిజిస్ట్రేషన్లు చేయాల్సి వస్తోంది. కానీ తిరకాసంతా ఇక్కడే వస్తోంది. విద్యార్థికి ఆధార్ కార్డు నమోదు సమయంలో వారి తల్లిదండ్రులు ఇంటి పేరునో, లేక పేరులో ఏదో ఒక అక్షరం తప్పుగా నమోదు చేయించేశారు. కొంతమంది అయితే ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ కూడా తప్పుగా నమోదు చేయించేశారు. తీరా అపార్ నమోదు సమయంలో విద్యార్థి టీసీలో ఉన్న పేరుతో, ఆధార్ కార్డులో ఉన్న పేరు, పుట్టిన తేదీ సరిపోవడం లేదు. దీంతో అపార్ రిజిస్ట్రేషన్ రిజెక్ట్ అవుతూ వస్తోంది.

పుట్టిన తేదీ మార్పులో తిరకాసు

విద్యార్థి ఆధార్ కార్డులో పుట్టిన తేదీ సరిదిద్దాలంటే ఆ విద్యార్థి టెన్త్ సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉందని ఆధార్ సెంటర్ నిర్వాహకులు చెబుతున్నారు. అదే విద్యార్థి ఒకటో తరగతి నుంచి 9వ తరగతి చెందిన వారికి ఈ సమస్య వస్తోంది. వీరు టెన్త్ క్లాస్‌కు ఇంకా చేరకపోవడంతో టెన్త్ సర్టిఫికెట్‌లు లేక ఆధార్‌లో పుట్టిన తేదీ మార్పులు, చేర్పులు చేయలేకపోతున్నారు. పోనీ రెవెన్యూ అధికారుల నుంచి పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకొద్దామంటే దీనికి ఎంత లేదన్నా వారం, పది రోజులు సమయం పడుతోంది. దీంతో ఆధార్‌లో మార్పులు, అపార్‌లో రిజిస్ట్రేషన్‌లు ఆలస్యమవుతున్నాయి. ఈ వివరాలు సక్రమంగా లేకుంటే అపార్ రిజిస్ట్రేషన్ రిజెక్ట్ అవుతోంది.

జిల్లాలో 50.12 శాతమే అపార్ పూర్తి

జిల్లాలో 30 మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ఈనెల 3వ తేదీ నాటికి అపార్ ఐడీ కేటాయించడం కేవలం 50.12 శాతం మాత్రమే పూర్తయింది. ఇందులో రాయచోటి మండలం 36.40 శాతం రిజిస్ట్రేషన్‌తో చివరి స్థానంలో ఉండగా పుల్లంపేట మండలం 69.99 శాతం రిజిస్ట్రేషన్ పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. అలాగే జిల్లాలో అపార్‌లో ప్రాథమిక పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌కు 1,18,257 మంది విద్యార్థులు చేసుకోగా, వారిలో ప్రాథమిక స్థాయిలో 67,730 మందివి జనరేట్ అయ్యాయి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 82,250 మంది ఎన్‌రోల్‌మెంట్ చేసుకోగా వారిలో 36,981 మందివి జనరేట్ అయ్యాయి. హైస్కూల్ స్థాయిలో 850 ఎన్‌రోల్‌మెంట్‌కుగాను 510 మాత్రమే జనరేట్ అయ్యాయి. మొత్తం మీద ఆదివారానికి 50.12 శాతం మాత్రమే జిల్లా వ్యాప్తంగా అపార్ ఐడీలు వచ్చాయి.

పండుగ సెలవుల్లేవు.. వారాల నోముల్లేవు

అపార్ ఐడీ నమోదు ప్రక్రియ ఉపాధ్యాయులకు తలబొప్పి కడుతోంది. నెల రోజులుగా ఉపాధ్యాయులు విద్యార్థుల ఆధార్ నెంబర్, యూడైస్ వివరాలు, అపార్ వివరాలు సరిపోక అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ పని దినాలతో పాటు దీపావళి, రెండో శని, ఆదివారాలు కూడా ఉపాధ్యాయులు అపార్ నమోదు కోసం కుస్తీలు పడుతున్నారు. అంతేకాకుండా అపార్ నమోదుకు చివరి తేదీ ఇదే అని జిల్లా విద్యాశాఖాధికారులు స్పష్టంగా చెప్పకపోగా 24 గంటల్లో గడువు పూర్తి అయిపోతుందని వారం రోజులుగా చెబుతున్నారు. దీంతో వారం, సెలవులు, నోములు వీటన్నింటిని పక్కన పెట్టి ఉపాధ్యాయులు అపార్ నమోదులో తలమునకలయ్యారు. ఇదిలా ఉండగా అపార్ నమోదులో ఉన్న ఉపాధ్యాయులు నిర్వహించే తరగతి బోధనలు పక్క తరగతి ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నారు. దీంతో అన్ని పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడిందనే చెప్పవచ్చు. ఇదిలా ఉంటే ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరేసి ఉపాధ్యాయులు మాత్రమే ఉన్న చోట అపార్ నమోదు కష్టాలు అపారంగానే మిగిలిపోతున్నాయి. ఇకనైనా విద్యాశాఖ అధికారులు అపార్ నమోదు గడువు పెంచాల్సిన అవసరం ఎంతో వుంది.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

అపార్ నమోదులో ఆధార్ వివరాలు సక్రమంగా లేకుంటే రిజెక్ట్ అవుతున్నాయి. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. అంతవరకు ఆధార్ వివరాలు సక్రమంగా ఉన్న విద్యార్థుల వివరాలతో అపార్ నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచనలిచ్చాము. బహుశా అపార్ నమోదు గడువు ఈనెల 25 వరకు పొడిగించే అవకాశం ఉంది.

- శివప్రకాష్‌రెడ్డి, డీవైఈవో, రాయచోటి

ఇన్‌చార్జి మంత్రితో సుగవాసి భేటీ

రాజంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డితో రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాల సుబ్రమణ్యం సోమవారం భేటీ అయ్యారు. రాయచోటిలో డీఆర్సీ సమావేశానికి వచ్చిన మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఆయనతో చర్చించారు. మరోసారి కలిసి అన్ని విషయాలు చర్చిద్దామని మంత్రి తెలిపినట్లు సుగవాసి చెప్పారు. ఆయన వెంట రాయచోటి టీడీపీ నాయకులు రాజశేఖర్, సిద్ధవటం టీడీపీ నాయకులు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి తదితరులు ఉన్నారు.



వేరు'శని'గ

● ఖర్చు ఎక్కువ, దిగుబడి తక్కువ ● తీవ్ర వర్షాభావంతో దెబ్బతిన్న వేరుశనగ
● అప్పుల పాలైన రైతులు ● ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు

గాలివీడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు ప్రధాన ఆదాయ వనరు వేరుశనగ. ఒకప్పుడు రైతు రారాజుగా పేరు పొందిన వేరుశనగ నేడు అదే రైతుకు శాపంగా మారుతోంది. లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన పంట తీవ్ర వర్షాభావం వల్ల రైతులను భిక్షాధికారిగా మారుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నీటి వనరులు ఉన్న ఏరియాల్లో పంట ఏపుగా పెరిగినప్పటికీ దిగుబడి మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. అయితే ఎక్కువ భాగం వర్షం లేకపోవడం వల్ల దిగుబడి తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేసేదేమీ లేక ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. మండలంలో మొత్తం 30 వేల ఎకరాల వ్యవసాయ భూమి కలదు. ఇందులో 15 వేల ఎకరాలకుపైగా వేరుశనగ సాగు భూమి ఉన్నది. మిగతా భూమిలో వరి, సజ్జ, రాగితో పాటు మామిడి తోటలు, కూరగాయల తోటలను సాగు చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైతులు వేరుశనగ సాగు చేస్తూ రావడం ఆనవాయితీ. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, వాతావరణం (నేల స్వభావం) వేరుశనగ సాగుకు అనుకూలం. అందువల్ల అత్యధిక జనాభా వేరుశనగను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత పది సంవత్సరాల క్రితం ప్రతి పల్లెలో ప్రతి ఇంటిలో ఇంటి నిండా వేరుశనగ కాయలు ఉండేవి. ఆ కాలంలో వేరుశనగ ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులతో పాటు వివిధ పట్టణ ప్రాంతాల్లో రైతులు గృహాలు, స్థలాలను కూడా కొనుగోలు చేశారు. కానీ రాను రాను వాతావరణంలో మార్పులతో పాటు సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల వేరుశనగను సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. నష్టాలు వస్తున్నప్పటికీ వేరుశనగపైన మక్కువతో సాగు విస్తీర్ణం మాత్రం తగ్గించలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని 14 పంచాయతీల్లో దాదాపు 10 వేల ఎకరాల వరకు వేరుశనగను సాగు చేశారు. ఇందులో నూలివీడు, సీసీపల్లె, పూలుకుంట, బోరెడ్డిగారిపల్లె, పందికుంట, తలముడిపి, కొర్లకుంట, గరుగుపల్లె, గుండ్లచెరువు, పేరంపల్లె, గోపనపల్లె, ఎగువ గొట్టివీడు, గోరాన్‌చెరువు, అరవీడు, గాలివీడు పంచాయతీల్లో వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేయగా వెలిగల్లు, తూముకుంట పంచాయతీల్లో కొంత మేర సాగు చేశారు. ఈ ప్రాంతంలోని నేల స్వభావాన్ని బట్టి నారాయణిరకం, లేపాక్షి, తిరుపతి, ట్యాగ్ 26, వశిష్ట, ఎర్రకాయలు వంటివి సాగు చేశారు.


గాలివీడులో ఎండిపోయిన వేరుశనగ

ఖర్చు ఎక్కువ.. దిగుబడి తక్కువ...

ప్రస్తుతం వేరుశనగ సాగుకు ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని, కానీ ఆదాయం మాత్రం రావడం లేదని రైతులు పేర్కొన్నారు. ఒక ఎకరా భూమిలో వేరుశనగను సాగు చేయడానికి 20 వేల రూపాయలకు పైబడి ఖర్చు అవుతోందని, ఇందులో విత్తనకాయలు 42 కేజీల బస్తా 3 వేలకు పైబడి ధర పెట్టి కొనుగోలు చేస్తున్నామని, దుక్కులు, ఎరువులు, కూలి, మందులు, కాయలను వలచడం వంటివి రేటు అధికమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం గింజలు భూమిలో వేసిన నాటి నుంచి వేరుశనగను తొలగించే వరకు అనేక రకాల తెగుళ్ల సోకుతున్నాయని పేర్కొన్నారు. గతంలో పంట సాగు కాలం అంతా కలిపిన ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే తెగుళ్లకు పిచికారీ చేసేవాళ్లమని కానీ నేడు నెలకు రెండు సార్లు తెగుళ్లకు పిచికారీ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒకపక్క తెగుళ్ల, మరొకపక్క తీవ్ర వర్షాభావం వల్ల పంట దిగుబడి తగ్గిపోయిందన్నారు. గతంలో ఒక ఎకరాకు 15 నుంచి 25 బస్తాలు వేరుశనగ దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది వర్షాలు లేకపోవడం వల్ల ఒక ఎకరాకు 5 నుంచి 6 బస్తాలు దిగుబడి వస్తున్నాయన్నారు. వ్యవసాయాధికారులు నిర్వహించిన పంట కోత ప్రయోగం నమోదు కూడా ఒక ఎకరాకు 5 నుంచి 6 బస్తాలు దిగుబడి వచ్చినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. పండిన కాయలకు కూడా గిట్టుబాటు ధరలేదని రైతులు పేర్కొన్నారు. ఒక ఎకరాకు 3 వేలకుపైబడి పెట్టి కొనుగోలు చేయగా రైతులు పండించిన పంటలకు మాత్రం 2 వేల రూపాయలు కూడా ధర పలకడం లేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఒక ఎకరా వేరుశనగను సాగు చేయడం వల్ల 15 వేల వరకు నష్టం వచ్చిందని, ఇలా అయితే చేసిన అప్పులు తీర్చడం కోసం ఉన్న భూములను కూడా అమ్మాలని మరికొంత మంది రైతులు తెలిపారు. మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల వేరుశనగను సాగు చేసిన రైతులు లక్షల్లో నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధిక మొత్తంలో నష్టపరిహారాన్ని రైతులకు అందించి ఆదుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు.



నూలివీడులో పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ అధికారులు


15 వేలకు పైబడి నష్టపరిహారం అందించాలి



మా కుటుంబం 5 ఎకరాల్లో వేరుశనగను సాగు చేశాము. ఒక ఎకరా వేరుశనగ సాగు చేయడానికి 20 వేలకు పైబడి ఖర్చు అయింది. దిగుబడి మాత్రం 5 బస్తాలు అయినవి. వర్షాలు లేకపోవడం వలన పంట దిగుబడి తగ్గిపోవడమే కాక కాయల నాణ్యత కూడా తగ్గిపోయింది. తద్వారా ఒక బస్తా ధర 2 వేల రూపాయలకు అమ్మాను. నాకు ఒక ఎకరాకు 10 వేలకు పైబడి నష్టం వచ్చింది. మొత్తం 5 ఎకరాలకు 60 వేలకు పైబడి నష్టపోయాము. కావున ప్రభుత్వం స్పందించి ఒక ఎకరాకు 15 వేల రూపాయలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- ఆదినారాయణ, వడ్డెపల్లె, చీమలచెరువుపల్లె

ఉపాధిని అనుసంధానం చేయాలి



ప్రస్తుతం వేరుశనగతో పాటు ఇతర పంటల సాగుకు దిగుబడి కన్నా ఖర్చు ఎక్కువ అవుతున్నది. పంట సాగుకు విత్తనాలు, ఎరువులతో పాటు కూలి రేట్లు అధికంగా ఉన్నాయి. పంటల మీద మక్కువతో అప్పులు చేసి సాగు చేస్తున్నాము. కానీ పంటలు దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాము. కావున ఎన్ఆర్ఐఈజీఎస్ పథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేస్తే రైతులకు కొంత మేర ఊరట లభిస్తుంది. తద్వారా నష్టాలను కూడా తగ్గించిన వారవుతారు.

- జనార్దన్, కొండ్రెడ్డిగారిపల్లె, నూలివీడు

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● అధికారులకు మంత్రి మండిపల్లి ఆదేశం


ప్రజా దర్బారులో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్‌లో అందిన వినతులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమ స్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజాదర్బార్‌లో అందిన అర్జీలను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

తిప్పనకొండలో భూమి అన్యాక్రాంతం

● పట్టించుకోని రెవెన్యూ శాఖ ● కొండను తవ్వి భూమి చదును చేసిన వైనం


శాఖరాజుపల్లి సర్వేనంబరు 175లో కొండను తవ్వేసిన ప్రాంతం

సిద్దవటం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాఖరాజుపల్లి రెవెన్యూ తిప్పనకొండ సర్వేనంబరు 175లో ఒక ఎకరా స్థలం కొండ ప్రాంతంలో కొండలు తవ్వి భూమి చదును చేశారు. బహిరంగంగా కనిపిస్తున్నా అటువైపు రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడలేదని పలు విమర్శలు వస్తున్నాయి. కొంతమంది తనకున్న డీకేటీ పొలంలో మరికొంత ప్రభుత్వ డీకేటీ రెవెన్యూ పొలాలు అన్యాక్రాంతం చేసినా రెవెన్యూ సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు కొంతమంది ఆరోపిస్తున్నారు. మండల పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో కొంతమంది రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా అవి ఏ మాత్రం అమలు కాలేదని, కొంతమంది బడా నేతలు ఇవన్నీ బయటకు రాకుండా రెవెన్యూ సిబ్బందితో మిలాఖత్ అయినట్లు ఆరోపణలు బలంగా వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల పని దినాలు, సెలవు రోజుల్లో కొంతమంది డీకేటీ రెవెన్యూ పొలంలో ఎక్సకవేటర్లు పెట్టి పనులు చేస్తున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదని మండల పరిధిలో చర్చనీయాంశంగా మారింది.

దీనిపై వీఆర్వో శివశంకర్‌ను వివరణ కోరగా.. సర్వే నెంబరు 175లో గ్రావెల్ తవ్వకాలు జరిపి భూమి చదును చేసిన విషయంపై పరిశీలిస్తానని, విధి నిర్వహణలో భాగంగా నూతనంగా బాధ్యతలు తీసుకున్నానని, రికార్డులు అన్నీ పరిశీలించి ఇలాంటి సంఘటనలు జరగకుండా తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


డీకేటీ పొలంలో ఎక్సకవేటర్, ట్రాక్టర్

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

● ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు

రాయచోటిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 11న భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం మానుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు నుంచి గతంలో దారి మళ్లించిన నిధులను బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, కోటి రూపాయలు బోర్డులో జమ చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీంబాషా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీంబాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కోశాధికారి హుస్సేన్, నరసింహులు, రమణయ్య, బాలకృష్ణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు


ఇద్దరు కుమారులతో అదృశ్యమైన ధనుశ్రీ

మదనపల్లె అర్బన్, నవంబరు 3: ఇద్దరి పిల్లలతో కలిసి మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె తాలుకా సీఐ రామచంద్ర తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణానికి చెందిన ధనుశ్రీ (32), ఇద్దరు కుమారులు డి.పార్థివ్ (10) డి.ధనుష్(8) కలిసి నవంబరు ఒకటో తేది నుంచి కనపడకుండా పోయారు. 11 ఏళ్ల క్రితం తంబళ్లపల్లెకు చెందిన ధనుశ్రీతో పీలేరు టౌన్ ఇందిర్మకాలనీకి చెందిన దేవర భార్గవ్‌కు వివాహమైంది. ధనుశ్రీ కూలీ పనులకు వెళుతుండగా, భార్గవ్ సెంట్రింగ్ పనులకు వెళుతుండేవాడు. రెండు నెలలు క్రితం వారు తమ పిల్లలతో కలిసి మదనపల్లె పట్టణం మాయాబజార్, వివేకానంద మున్సిపల్ స్కూల్ వెనుకవైపు కాపురం ఉంటున్నారు. రెండు రోజులుగా కనపడకపోవడంతో బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ధనుశ్రీ తండ్రి మల్లికార్జున పిర్యాదు మేరకు ఆదివారం విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ బడులను బతికించుకుందాం

● మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణం

మదనపల్లెఅర్బన్, నవంబరు 3:(ఆంధ్రజ్యోతి) పాలకుల విధానాల వల్ల ప్రభుత్వ బడులు నిర్వీర్యం అవుతున్నాయని, వీటిని కాపాడుకొనేందుకు యూటీఎఫ్ నిరంతరం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ, మాజీ ప్రొటెం ఛైర్మన్ విఠపు బాలసుబ్రహ్మణం పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా పేద ప్రజల పిల్లలకు చదువులు దూరం అవుతాన్నాయని అభిప్రాయపడ్డారు. ఒక ఉపాధ్యాయ సంఘం లక్ష సభ్యత్వాలతో రాష్ట్రంలో బలమైన సంఘంగా ఏర్పడి 50 ఏళ్ల పూర్తి చేసుకుందన్నారు. అదే ఒరవడితో నిజాయితీ, నిబ్ధతతో కార్యకర్తలు కొనసాగి ఉద్యమించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రయోజనాలకు పనిచేస్తున్నాయే తప్ప ఉపాధ్యాయుల ప్రయోజనాలకు పనిచేయడం లేదని వాపోయారు. వేల కోట్ల బకాయిలు ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని, 13వ పీఆర్సీ ఊసేలేదని, నెలవారి ప్రమోషన్ పక్కన పెట్టారని త్వరలో ఉద్యమ కార్యాచరణ ద్వారా వీటన్నింటినీ సాధించి తీరుతామన్నారు. పూర్వ కార్యదర్శి బాబురెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఏర్పడిన అసంబద్ధతను తొలగించాలన్నారు. వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని, స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీరాజు, శ్రీనివాసులురెడ్డి, యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి జాబీర్, సహాధ్యక్షుడు హేమలత, శివారెడ్డి, ట్రేజరర్ చంద్రశేఖర్ జిల్లా నాయకులు వెంకటరమణ, సురేంద్ర రెడ్డి, రమణమూర్తి, ఆదినారాయణ, భాస్కర్ రెడ్డి, సుధాకర్, అక్రంబాషా, దావుద్దీన్, శ్రీనివాసులు, అంజాద్, వెంకటయ్య, హరికృష్ణ, శ్రీనప్ప, యూసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మీకి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


గుర్రంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృ తాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

'పల్లె పండుగ' టార్గెట్ ఇదే!

● సంక్రాంతి నాటికి కొత్త వెలుగులు
● మండలానికి రూ.4.32 కోట్ల నిధులు
● 48 అభివృద్ధి పనులతో కళకళ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. గత ప్రభుత్వం తప్పిదాలను సరిచేస్తూ గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తోంది కూటమి ప్రభుత్వం. సంక్రాంతి నాటికి వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసేలా పల్లె పండుగ వారోత్సవాలను చేపట్టింది. పల్లె పండుగతో గ్రామాల్లో కొత్త వెలుగులు తేనున్నాయి. ప్రొద్దుటూరు మండల పరిధిలో రూ.4.32 కోట్ల వ్యయంతో వివిధ రకాల 48 అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. సంక్రాంతి నాటికి గ్రామాల్లో పనులు పూర్తయి కొత్త వెలుగులు చిమ్మనున్నాయి.


● గత ప్రభుత్వ హయాంలో కనీసం పల్లెల్లో రోడ్లు లేక చెరువుల్లో పూడికలు తీసే దిక్కులేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇక రోడ్లకోసం కేటాయించిన నిధులు, పంచాయతీరాజ్‌కు రావాల్సిన కేంద్ర ప్రభుత్వ సొమ్మును గత ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లించడంతో గ్రామాలు కళ కోల్పోయాయి. ఆ తప్పిదాలను సరిదిద్దుతూ గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముందుకు సాగాలనే కాన్సెప్ట్‌తో ప్రారంభమైందే ఈ పల్లె పండుగ. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, అధికారుల సమన్వయంతో ఇప్పటికే అన్ని పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు పూర్తయి లక్ష్యసాధన దిశలో ముందుకు సాగుతున్నది.


అపరిశుభ్రత, గుంతల నుంచి మహర్దశ పట్టనున్న రోడ్లు

● ప్రొద్దుటూరు మండల పరిధిలో రూ.4.32 లక్షల వ్యయంతో 45 సీసీ రోడ్లు, ఒక మెటల్ రోడ్డు, రెండు కాంపౌండ్‌వాళ్ల పనులను మంజూరయ్యాయని పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. చెన్నంరాజుపల్లె పంచాయతీకి రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, కామనూరు పంచాయతీకి 74.2 లక్షలతో సీసీ రోడ్డు, పాఠశాల కాంపౌండ్ వాల్ మంజూరైనట్లు తెలిపారు.

రూ.34.2 లక్షల వ్యయంతో దొరసానిపల్లె పంచాయతీలో సీసీ రోడ్లు, రూ.22 లక్షల వ్యయంతో ఉప్పరపల్లె పంచాయతీలో సీసీ రోడ్లు, రూ.10 లక్షల వ్యయంతో కల్లూరు పంచాయతీలో సీసీ రోడ్లు, రూ.30 లక్షల వ్యయంతో తాళ్లమాపురం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు వేయనున్నారు. నంగనూరుపల్లె పంచాయతీకి రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, సీతంపల్లె పంచాయతీకి రూ.35 లక్షల వ్యయంతో రోడ్ల నిర్మాణ పనులు, చౌడూరు పంచాయతీకి రూ.15 లక్షలతో సిమెంటు రోడ్డు పనులు, చౌటపల్లె పంచాయతీలో రూ.65 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లు, మెటల్ రోడ్డు మంజూరైనట్లు చెప్పారు. పెద్దశెట్టిపల్లె పంచాయతీలో రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, శంకరాపురం గ్రామ పాఠశాలలో కాంపౌండ్ వాల్, రూ.38 లక్షల వ్యయంతో గోపవరం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, రూ.15 లక్షల వ్యయంతో కొత్తపల్లె పంచాయతీ పరిధిలో సిమెంటు రోడ్లు, రూ.27 లక్షల వ్యయంతో సోములవారిపల్లె పంచాయతీ పరిధిలో సిమెంటు రోడ్ల పనులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద ఈ పల్లె పండుగ సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 45 సిమెంటు రోడ్లు, ఒక మెటల్ రోడ్డు, రెండు పాఠశాలలకు రెండు కాంపౌండ్‌వాళ్లు అందుబాటులోకి రానున్నాయి.

గ్రామాలకు కొత్త వెలుగు



పల్లె పండుగతో గ్రామాలు కొత్త వెలుగులతో కళకళలాడనున్నాయి. మండల పరిధిలో 48 పనులు మంజూరయ్యాయి. ఏడాది చివరి డిసెంబరు నాటికి పనులను పూర్తి చేసి సంక్రాంతికి ప్రారంభోత్సవాలు చేయనున్నాం. ఆదిశగా చర్యలు తీసుకుంటున్నాం.

- సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో

త్వరితగతిన పూర్తి చేస్తాం



మండల పరిధిలోని గ్రామ గ్రామానికి తిరిగి మంజూరైన పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చేస్తాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, అందరి సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. లక్ష్యానికంటే ముందుగానే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- డి.లక్ష్మీనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ

ప్రాథమిక విద్యకు పునరుజ్జీవం



- 117 జీవో రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- జిల్లాలో పాఠశాలలకు ఎంతో ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ తప్పిదంతో గాడి తప్పిన ప్రాథమిక విద్యా వ్యవ స్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం తొలి అడుగులు వేసింది. అనాలోచితంగా వైసీపీ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీవో 117ను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్ర బాబు ప్రకటించారు. దీనిపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ప్రాథమిక విద్య 1 నుంచి 5 తరగతుల వరకు ప్రతి పల్లెలో, 3 కిమీ పరిధిలో ప్రాథమికోన్నత, ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు అనతి కాలం నుంచి నడుస్తున్నాయి. కానీ విద్యాసంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నెం.117తో ప్రాథమి విద్య నిట్టనిలువునా చీలి పోయింది. విద్యాకమిషన్ లేకుండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా సబ్జెక్టు నిపుణుల బోధన ఉండాలని, ఆంగ్లవిద్యను బలోపేతం చేయాలని విలీన విధానాన్ని తీసుకువచ్చారు. కిలోమీటరు పరిధి ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు విలీనం చేశారు. అక్కడ నుంచే ప్రాథమిక విద్య విచ్ఛిన్నానికి దారి తీసింది. ఈ ప్రక్రియను నిరసిస్తూ పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులు ధర్నాలు, నిరసనలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక తమ పిల్లలను ప్రభు త్వ పాఠశాలల నుంచి దారి మళ్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రజాప్రతినిధుల పలుకుబడితో కొన్నిచోట్ల మాత్రం విలీనం ఆపగలి గారే తప్ప ప్రతి చోటా అమలులోకి వచ్చింది. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు స్కూలు అసిస్టెంటు స్థాయి ఉపాధ్యాయులు బోధించడంతో విద్యా లక్ష్యాలు ఆశించిన స్థాయిలో సాధించలేకపోవడం గమనార్హం. దీంతో తమ గ్రామం నుంచి వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో అధిక శాతం మంది విద్యార్థులు డ్రాపవుట్లుగా మారారు. క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. చివరికి ప్రాథమిక విద్య విద్యార్థుల్లో సాధించాల్సిన లక్ష్యాలు సాధించకపోవడంతో పాటు తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపడంతో ప్రభుత్వపాఠశాలల్లో ప్రాథమిక విద్యా ర్థుల సంఖ్య తగ్గిపోయింది.

450 పాఠశాలలు విలీనం

తగిన కార్యాచరణ లేకుండా, పర్యవసనాలు ఆలోచించ కుండా గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవోతో ప్రభుత్వ విద్యావ్యవస్థ నిర్వీర్యమైంది. 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తామని 3, 4, 5 తరగతులను కిలోమీటరు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీ నం చేసింది. ఈ నిర్ణయం విపరీత పరిణామాలకు దారి తీస్తుందని ఉపాధ్యాయ సంఘాలు ఎంత చెప్పినా గత వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. చివరికి ప్రాథమిక బడుల ఉనికికే ముప్పు తెచ్చింది. జీవో అమలులో భాగంగా జిల్లాలో 450 ప్రాథమిక పాఠశాల ల్లోని 3, 4, 5 తరగతుల పిల్లలను 313 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. అలాగే 407 ప్రాథమిక పాఠశాలలను 275 ఉన్నతపాఠశాలల్లో విలీనం చేయగా 40 ప్రాథమిక పాఠశాలలు 35 ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు 3 ఉన్నతపాఠశాలల్లోనూ.. మొత్తం 450 పాఠశా లలు 313 ఉన్నతపాఠశాలల్లో విలీనం చేశా రు. ఈ క్రమంలో పలు సమ స్యలు ఉత్పన్నం అయ్యాయి. నిబంధనల ప్రకారం ప్రతి తరగతికి ఒక గది ఉండాలి. ప్రతి సబ్జెక్టుకు ఒక టీచరు ఉండాలి. ఈ దిశగా చర్యలు తీసుకోకపో వడంతో గదులు లేక చాలా చోట్ల వరండాల్లో పిల్లలను కూర్చోబెట్టారు. కొన్ని చోట్ల ఒకే గదిలో రెండేసి తరగతులు కూడా నిర్వహించారు. 2022లో విలీనం ఏర్పడితే 2023 విద్యాసంవత్సరం చివరిలో పదోన్నతులు కల్పి ంచి ఉపాధ్యా యులను సర్దుబాటు చేశారు. ఈ విధంగా ఒక బ్యాచ్ విద్యార్థులకు సరైన బోధన లభించలేదని చెప్పవచ్చు.

647 ఏకోపాధ్యాయ పాఠశాలలు

ఈ జీవోతో తలెత్తిన మరో ప్రధాన సమస్య ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గిపోవడం. దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు పిల్లలను పంపేం దుకు చాలా మంది తల్లిదండ్రులు ఇష్టపడలేదు. దీంతో ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. అలా ఏటా 17 శాతం మేర ప్రవేశాలు తగ్గినట్లు సమాచారం. దీంతో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిలో తేడా వచ్చింది. నిబంధనల ప్రకారం 20 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. విద్యార్థుల సంఖ్య తగ్గ డంతో ఎక్కువ మంది ఉన్న చోటకు టీచర్లను బదిలీ చేశారు. ఈ క్రమంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగాయి. జిల్లావ్యాప్తంగా 647 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

ప్రాథమిక పాఠశాలల విలీనం రద్దు ప్రకటన హర్షణీయం



ప్రాథమికపాఠశాలల విలీనం రద్దు ప్రకటన హర్షణీయం. రాష్ట్రవిద్యాశాఖ పాఠశాలల విలీనం రద్దు చేస్తామని ప్రకటించడం ప్రాథమిక విద్యకు ప్రాణం పోసినట్లయింది. ప్రతి కిలో మీటరు పరిధిలో ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తర గతి వరకు నడిచేలా చర్యలు చేపట్టాలి.

- సీవీ ప్రసాద్,
ఏపీటీఎఫ్ అమరావతి, రాష్ట్ర అధ్యక్షుడు

ఉపాధ్యాయ సంఘాలు చెప్పినా ..



ఉపాధ్యాయ సంఘాలు ఎంత చెప్పినా వినకుండా ఉపాధ్యాయులు, మేధావుల మనోగతానికి విరుద్ధంగా గత ప్రభుత్వం తీసుకువ చ్చిన 117 జీవో ద్వారా ప్రభుత్వపాఠశాలలు కను మరుగయ్యాయి. చాలా వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయా యి. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాల్లో చదివే పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్య దూరమైంది. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ప్రాథమిక పాఠశాల లకు పూర్వవైభవం వచ్చినట్లయింది.

- ఎం.వెంకటశివారెడ్డి,
పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంది



ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు జీవో నెం.117ను రద్దు చేయడం సంతోషించదగ్గ విషయం. ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినప్ప టికీ గత ప్రభుత్వం జీవో117 అమలు చేసి ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం నిర్ణయం ద్వారా ప్రాథమిక పాఠ శాలలకు మళ్లీ పూర్వవైభవం వచ్చిందని చెప్పాలి.

- ఎ.శ్యాంసుందర్‌రెడ్డి,
ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

జీవో117 రద్దును స్వాగతిస్తున్నాం



నూతన జాతీయ విద్యావి ధానాన్ని అమలు చేసే సాకుతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో117ను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. జీవో 117 వల్ల ప్రభుత్వ విద్యారంగం అస్తవ్యస్తంగా తయారైంది. ఎన్నికలకు ముందు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జీవో 117ను పూర్తిగా రద్దు చేయాల్సి ఉంది.

- ఎ.విజయకుమార్,
యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు

జీవో 117పై సమగ్ర సమీక్ష చేయాలి



రాష్ట్రప్రభుత్వం జీవో 117పై సమగ్ర విశ్లేషణ చేసి తగిన నిర్ణయం తీసుకో వాలి. జీవో 117ను రద్దు చేసి వచ్చేవిద్యాసంవత్సరం నుంచి క్రమంగా రాబోవు విద్యాసంవత్సరంలో 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో తరగతి వారీగా పెంచుకుంటూ వెళ్లాలి. ఇప్పుడున్న ఉన్నత పాఠశాలల్లోని 3, 4, 5 తరగతు లను అలాగే కొనసాగించాలి. అప్పుడు పదోన్నతి పొందిన స్కూలు అసిస్టెంట్ల సర్దుబాటుకు తగిన సమయం ఉంటుంది.

- కె.సురేశ్‌బాబు,
ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

ట్యాంకు పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య



పులివెందుల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డుశేషారెడ్డి స్కూలు సమీపంలో నివాసముంటున్న బాబుల్‌రెడ్డి (35) ఆదివారం ఉదయం ట్యాంకు పైనుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం వెన్నపూసపల్లి గ్రామానికి చెందిన బాబుల్‌రెడ్డి తల్లి దండ్రులు చనిపోవడంతో మేనత్త అయిన లక్ష్మమ్మ దగ్గరే ఉంటున్నాడు. కొన్ని సంవత్సరాల కిందట తల్లిదండ్రులు చని పోవడంతో బాబుల్‌రెడ్డికి మతిస్థిమితం సరిగాలేక మానసికంగా ఇబ్బంది పడు తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పులివెందులలోని రంగనాథ గుడి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి కిందికి దూకడంతో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న ఎస్ఐ విష్ణు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలు సుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల సర్వజనా సుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొలెరో వాహనం ఢీ.. యువకుడి మృతి



ప్రమాదస్థలంలో చెన్నకేశవ మృతదేహం, చెన్నకేశవ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె/గోపవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని ఎస్.సోమవరం గ్రామం బావులకాడపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నకేశవ (29) అనే యువకుడు అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గోపవరం మండలం పెద్దగోపవరం గ్రామానికి చెందిన చెన్నకేశవ వృత్తిరీత్యా బద్వేలులోని క్రిష్ణ కాంప్లెక్స్‌లో ఒక బార్బర్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఆరు నెలల పాప ఉన్నారు. చెన్నకేశవ వీలేరులో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. ఇతని మరణ వార్త వినడంతో ఆ కుటుంబం విలపి స్తోంది. ఇక మాకు దిక్కెవరని కన్నీటి పర్యంతమవుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భక వత్సలం తెలిపారు. కాగా మృతుడికి అమ్మతో పాటు మతిస్థిమితం లేని అన్న కూడా ఉన్నాడు. చెన్నకేశవ మృతితో ఆ కుటుంబానికి దిక్కులేకుండా పోయిం దని.. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జమ్మలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని దిగువపట్నం కాలనీ శివార్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... మున్సిపాలిటీ పరిధిలోని దిగువపట్నం కాలనీ శి వార్లలో 50 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఆప్రాం తవాసుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలా నికి వెళ్లి పరిశీలించారు. మృతుడు బట్టతల కలిగి.. నలుపురంగు కాటన్ ప్యాం టు, బ్లూకలర్ గల్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా పూర్తిగా పాడైపోయింది. 3 నుంచి 4 రోజుల క్రితం ఆ ప్రాంతంలో మృతదేహం ఉన్నట్లుందని.. ఎవరైనా పైన తెలిపిన ఆనవాళ్లు తెలిస్తే అర్బన్ పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



వేంపల్లె సమీపంలో బోల్తాపడ్డ సిలిండర్ల లారీ

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణ సమీ పంలోని వేంపల్లె-పులివెందుల రోడ్డులో ఎస్ఎస్ఆర్ కల్యాణ మం డపం వద్ద హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాం టి ప్రమాదం జరగలేదు. వివరాల్లోకి వెళితే.. గ్యాస్ సిలిండ ర్లను నింపుకొని అనంతపురం నుంచి లక్కిరెడ్డిపల్లెకు లారీ బయలు దేరింది. ఆదివారం వేకువజామున వేంపల్లె సమీ పంలో అదుపుతప్పి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కొన్ని సిలిండర్లు దెబ్బతిన్నాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగ లేదు. అయితే లారీలోని సిలిండర్లు దెబ్బతిన డంతో పేలుతాయేమోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది వద్ద ఇసుకను అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్న ట్లు ఆర్కేవ్యాలీ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో ఇసుక తరలించు కోవచ్చని చెప్పడంతో పెద్దఎత్తున ఇసుకను తరలిస్తున్నారు. దీనికి తోడు ప్రస్తుతం అనుమతి లేని లారీలు, టిప్పర్లలో కూడా కొద్దిరోజులుగా పాపాఘ్నినది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు ప్రచారం ఉంది. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించగా గవిమల్లేశ్వరాలయం సమీపంలో నది వద్ద ఉన్న రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్, హిటాచిని స్వాధీనం చేసుకుని వేంపల్లె పోలీస్‌స్టేషన్‌కు అప్పగించా రు. స్వాధీనం చేసుకున్న వాహనాలను తహసీల్దార్ హరినాథరెడ్డికి అప్పగించ నున్నట్లు వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. తదుపరి చర్యలు తహసీల్దార్ తీసుకోవాల్సి ఉంది.

ఇసుకరీచ్‌లపై మొబైల్ పార్టీ దాడులు

కొండాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకరీచ్‌లపై ఆదివారం మొబైల్‌పార్టీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కడప నుంచి వచ్చిన మొబైల్ స్క్వాడ్ ఏటూ రు ఇసుకరీచ్‌ను తనిఖీ చేశారు. అక్కడ లోడింగ్ చేసిన నాలుగు ఇసుక టిప్పర్లను పరిశీలించారు. అయితే వాటికి శనివారం నాటి బిల్లులు ఉండటంతో ప్రశ్నించారు. రాత్రి కావడంతో వెళ్లలేదని టిప్పర్ల యజమానులు తెలిపారు. దీంతో ఈ టిప్పర్లపై తహసీల్దార్‌కు విచారణకు ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మొబైల్‌టీమ్, రెవెన్యూ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



మోడెం చౌడయ్య (ఫైల్)

చిన్నమండెం, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన మోడెం చౌడ య్య కనిపించడం లేదని అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం... మల్లూరు గ్రామ కోడిదేపల్లికి చెం దిన మోడెం చౌడయ్య (44) వ్యవ సాయం చేసేవాడు. మంగళవారం ఉదయం 5 గంటల నుం చి కనిపించలేదని.. తమకు తెలిసిన ప్రాంతాలన్నీ వెతికినా ఆచూకీ లభించలేదని అతని భార్య మోడెం కుమారి పోలీ సులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి



ప్రొద్దుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని మడూరు క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీ వివరాల మేరకు.. చాపాడు మండలం మడూ రు గ్రామానికి చెందిన మహబూబ్ షరీఫ్(50) తినుబండా రాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంలో ప్రొద్దుటూరు నుంచి తన స్వగ్రామం మడూరుకు బయలుదేరాడు. మడూరు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా జమ్మలమడుగు వైపు నుంచి వేగంగా వస్తున్న బొలేరో వాహనం అతన్ని ఢీకొట్ట డంతో బైక్ పై నుంచి కింద పడ్డాడు. ఈ క్రమంలో తలకు బలమైన గాయాలు కావడంతో షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

'పారిపోయిన ఖైదీది చిత్తూరు జిల్లానగరి'

కడప క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత నెల 30న ఓపెన్ జైలు నుంచి పారిపోయిన ఖైదీ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారు కాదని చిత్తూరు జిల్లాలోని నగరిప్రాంతానికి చెందిన శరవణ్ అని కడప కేంద్ర కారాగార సూపరిం టెండెంట్ రాజేశ్వర్‌రావు ప్రకటనలో తెలిపారు. జైలు నుంచి పారిపోయిన వెంటనే రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వర్క్ కేసు నమోదు చేశారని.. ఇతర రాష్ట్రాలకు చెందిన ఖైదీలను ఓపెన్ జైలుకు ఎంపిక చేయమని తెలిపారు. నింది తున్ని అరెస్టు చేసి కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

నుండుపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, ఆయన కూతురిపై అసభ్యకర పోస్టులు పెట్టడంపై జనసేన నాయకుడు రామాశ్రీనివాసులు ఆది వారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్విట్టర్ అకౌంట్‌లో అసభ్యకర పోస్టులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడి యాలో అసభ్యకర పోస్టులు చేసిన వారిని గుర్తించి వారి సోష ల్ మీడియా అకౌంట్‌తో సహ పోలీసులకు అందజే శామ న్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సు వ్యాలిడిటీ పెంపు

- నవంబరు 8 నుంచి పర్మినెంటు లైసెన్సుతోనే వ్యాపారం

పులివెందుల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సుల గడువు మరో నాలుగురోజుల పాటు పెంచుతూ ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసకుంది. తొలుత అక్టోబరు 31తో ప్రొవిజనల్ లైసెన్సుల గడువు ముగు స్తుందని.. నవంబరు 1 నుంచి పర్మినెంటు లైసెన్సు ఉంటేనే వ్యాపారం చేయా లని ప్రభుత్వం మార్గదర్శకాలు చేసింది. కానీ నిర్ణీత గడువు అక్టోబరు 30 నాటికి మద్యం షాపుల లైసెన్సుదారుల నుంచి పర్మినెంటు లైసెన్సుల కోసం పెద్దగా స్పందన లేదు. ఈ క్రమంలో ఈ నెల 7 వరకు ప్రొవిజనల్ లైసెన్సు వ్యాలిడిటీ పెంచడంతో పాటు నవంబరు 8 నుంచి పర్మినెంటు లైసెన్సు ఉంటేనే మద్యం వ్యాపారాలు చేసే వీలుంటుందని ఎక్సైజ్ శాఖ తెలిపింది. కడప జిల్లావ్యాప్తంగా 139 మద్యం షాపులకు ప్రొవిజనల్ లైసెన్సులను అక్టోబరు 15న ఎక్సైజ్ శాఖ సదరు యజమానులకు అందించింది. తొలుత ప్రకటించిన అక్టోబరు 31 గడువు నాటికి 139 షాపుల్లో 20 మందికి కూడా పర్మినెంటు లైసెన్సు ప్రొసీజర్ పూర్తి చేయలేదని అధికారులు చెబుతున్నారు. చాలా షాపుల లొకేషన్ విషయంలో యజమానులు ఓ అంచనాకు రాకపోవడంతో బ్యాంకు గ్యారంటీలు సమర్పించ డంలో కూడా జాప్యం జరగడంతో గడువు పొడిగించారని పులివెందుల ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. పెంచిన గడువు ఉపయోగించుకుని నిర్ణీత తేదీలోగా మద్యం షాపులకు పర్మినెంటు లైసెన్సు పొందాలని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధి కారులు తెలిపారన్నారు. లొకేషన్ ఎంచుకునేటప్పుడు ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయి తనిఖీల్లో భాగంగా షాపు లొకేషన్ విషయంలో నిబంధనలు పాటించలేదని అధికారుల దృష్టికి వస్తే పర్మి నెంటు లైసెన్సు ఇవ్వడం జరగదన్నారు. దీంతో పాటు బ్యాంకు గ్యారంటీ, కౌంట రు పార్టీ అగ్రిమెంటు, షాపు లీజు, ఇతర డాక్యుమెంట్లు కూడా ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో అందించాలని, నవంబరు 7 కల్లా పర్మినెంటు లైసెన్సులు పొం దాలని మద్యంషాపుల యజమానులను ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు కోరుతున్నారు.

చిల్లర దొంగల హల్‌చల్... పలు షాపుల్లో చోరీ

కడప క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో చిల్లర దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు దొంగలు అక్కడ తాళాలు వేసిన కొన్ని షాపుల్లోకి చోరీ యత్నం చేశారు, కొన్ని షాపుల షట్టర్లను తెరిచేందుకు విఫలయత్నం చేశారు. కొన్ని షాపుల్లో దేవుని వద్ద ఉంచిన హుండీలో చిల్లర డబ్బులు చోరీ చేయగా.. కొరియర్ ఆఫీసులోకి వెళ్లి అక్కడ పార్సల్‌లో ఉన్నటువంటి టీషర్టులను వేసుకుని ఇద్దరు దొంగలు గొడవ పడ్డ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అయితే రెండుషాపుల్లో దాదాపు రెండువేలకు పైగా నగదు దొంగలు అపహరించినట్లు తాలుకాసీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా ఇప్పటి వరకు బాధితులు ఫిర్యాదు చేయలేదని, వారు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారిస్తామన్నారు. కాగా పోలీసులు ఒక దొంగను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది.

రేపు కొండయ్యస్వామి పుట్టినరోజు వేడుకలు



మైదుకూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయపల్లెలో అవధూత కొండయ్యస్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో మంగళవారం కొండయ్య స్వామి పుట్టినరోజు సంద ర్భంగా భారీ కేకును కట్‌చేసి భక్తులకు పంచిపెడతారు. రాత్రి జబర్దస్త్ టీమ్ వారిచే నవ్వుల కార్యక్రమం ఉం టుంద న్నారు. బుధవారం వృషరాజములచే బండలాగు పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతిరోజు భక్తులకు అన్నదానం ఉంటుందని కొండయ్యస్వామి శిష్య బృందం తెలిపారు.

వ్యాధుల తీవ్రతపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రపంచంలో వ్యాధుల తీవ్రతపై ఎప్పటికప్పుడు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కడప ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ జోనల్ సీఎంఈ కోఆర్డినేటరు, కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనరసమ్మ తెలిపారు. ఆదివారం కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో ఫిజి యాలజీ లెక్చర్ గ్యాలరీలో డాక్టర్ ఎన్టీఆర్‌హెల్త్ యూని వర్శిటీ ఆధ్వర్యంలో జోనల్ 3 సీఎంఈ కార్యక్రమం నిర్వ హించారు. మైక్రో బయాలజీ హెచ్‌వోడి డాక్టర్ బి.నాగ శ్రీలత పాల్గొని మాట్లాడారు. కడప ప్రభుత్వ వైద్య కళా శాల మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నాగ సుధారాణి, డాక్టర్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్‌ఫ్యాకల్టీ నియామకాలకు నేడు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైవీయూ లోని పీజీ కళాశాలలో సోమవారం గెస్ట్‌ఫ్యాకల్టీ నియా మకానికి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి ప్రకటనలో తెలిపారు, కామర్స్ సబ్జెక్టుకు గెస్ట్‌ఫ్యాకల్టీ ఎంకాం అర్హతతో పాటు పీహెచ్‌డీ నెట్ సెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. కాంపి టిషన్ డేటా సైన్స్ సబ్జెక్టుకు ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఎమ్మెస్సీ కంప్యూటరు సైన్స్, ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఎంసీఏలలో ఏదోక అర్హతతో పాటు పీహెచ్‌డి, నెట్ సెట్ అర్హత కలిగి ఉండా లన్నారు. అభ్యర్థులు అర్హత పత్రాలతో సోమవారం ఉద యం 10గంలకు వైవీయూ క్యాంపస్ ప్రిన్సిపల్ చాంబరులో హాజరు కావాలన్నారు.

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

వీరబల్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగిమళ్ల, దిగువరాచపల్లిలో వైసీపీకి చెందిన వంగిమళ్ల సర్పంచ్ సరస్వతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నాగులయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అన్నమయ్య, మధుసూదన్‌రెడ్డి, బాబురెడ్డితో సహా సుమారు 200 మంది కార్యకర్తలు ఆదివారం రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, మండల టీడీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. సుగవాసి టీడీపీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో వంగిమళ్ల గ్రామాన్ని కంచుకోటలా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు జయచంద్రారెడ్డి, రెడ్డెయ్య, గ్రామ నాయకులు వెంకటకృష్ణారెడ్డి, డీలర్ బాబు, శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, చింతల రవి, శ్రీనివాసులరెడ్డి, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

సుండుపల్లె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.62,500 చెక్కును సుండుపల్లె మండలం జీ. రెడ్డివారిపల్లెకు చెందిన షేక్. జాకీర్‌కు అందజేసినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్‌నాయుడు ఆదివారం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా



జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్ రెడ్డిని సన్మానిస్తున్న రైల్వే కోడూరుటీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా తొలిసారి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాల, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ సన్మానించారు. అనంతరం జిల్లా మంత్రి మండిపల్లె రాం ప్రసాద్ రెడ్డిని, ఎమ్మెల్సీ రాంభోపాల్‌రెడ్డితో కలిసి రైల్వేకోడూరులోని పార్టీ స్థితిగతులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

రాయచోటిటౌన్: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు మంత్రిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అంద జేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాయచోటి(కలెక్టరేట్): అనుమతులు లేని శిక్షణ సంస్థల పేరుతో చలామణిలో ఉన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) బోగస్ సర్టిఫికెట్లను వెంటనే ఏరివేయాలని ఏపీ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం కన్వీనర్ విశ్వనాథరెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై మంత్రి స్పందిస్తూ అనధికారికంగా ఎవరైతే ఉద్యోగాలు చేస్తు న్నారో వాళ్లందరిపై కూడా ఎంక్వయిరీ చేయిస్తామని హామీ ఇచ్చారని విశ్వనాథరెడ్డి తెలిపారు.

జూదరుల అరెస్టు

ఒంటిమిట్ట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, రూ.11,400 స్వాధీనం చేసుఉకున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. మండలంలోని కొన్నకొత్తపల్లిలో పేకాట సమా చారం అందడంతో ఆదివారం దాడులు నిర్వహించామన్నారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

యువకుడిపై దాడి: పాతకక్షల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వినాయక చవితి సందర్భంగా ఏర్పడిన మనస్పర్థలను మనసులో ఉంచుకుని బాలాజీతోపాటు మరో ఇద్దరు యువకులు ఆదివారం రాత్రి మండల కేంద్రంలో నితిన్ అనే యువకుడిపై దాడి చేశారు. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

హాస్టల్‌కు వాషింగ్ మెషీన్ వితరణ

సిద్దవటం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీరాములుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర కేంద్రీకృత వసతిగృహానికి వార్డెన్ తిరుపతిరెడ్డి ఆదివారం వాషింగ్‌మెషీన్‌ను అందజేశారు. ఈ డీఎస్‌డబ్ల్యూవో జయప్రకాష్ దానిని ప్రారంభించారు. వార్డెన్‌ను అభినందించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసమూర్తి, వార్డెన్‌లు తిరుపతిరెడ్డి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు

వేరు 'శని'గ

● ఖర్చు ఎక్కువ, దిగుబడి తక్కువ ● తీవ్ర వర్షాభావంతో దెబ్బతిన్న వేరుశనగ
● అప్పుల పాలైన రైతులు ● ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు

గాలివీడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు ప్రధాన ఆదాయ వనరు వేరుశనగ. ఒకప్పుడు రైతు రారాజుగా పేరు పొందిన వేరుశనగ నేడు అదే రైతుకు శాపంగా మారుతోంది. లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన పంట తీవ్ర వర్షాభావం వల్ల రైతులను భిక్షాధికారిగా మారుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నీటి వనరులు ఉన్న ఏరియాల్లో పంట ఏపుగా పెరిగినప్పటికీ దిగుబడి మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. అయితే ఎక్కువ భాగం వర్షం లేకపోవడం వల్ల దిగుబడి తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేసేదేమీ లేక ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. మండలంలో మొత్తం 30 వేల ఎకరాల వ్యవసాయ భూమి కలదు. ఇందులో 15 వేల ఎకరాలకుపైగా వేరుశనగ సాగు భూమి ఉన్నది. మిగతా భూమిలో వరి, సజ్జ, రాగితో పాటు మామిడి తోటలు, కూరగాయల తోటలను సాగు చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైతులు వేరుశనగ సాగు చేస్తూ రావడం ఆనవాయితీ. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, వాతావరణం (నేల స్వభావం) వేరుశనగ సాగుకు అనుకూలం. అందువల్ల అత్యధిక జనాభా వేరుశనగను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత పది సంవత్సరాల క్రితం ప్రతి పల్లెలో ప్రతి ఇంటిలో ఇంటి నిండా వేరుశనగ కాయలు ఉండేవి. ఆ కాలంలో వేరుశనగ ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులతో పాటు వివిధ పట్టణ ప్రాంతాల్లో రైతులు గృహాలు, స్థలాలను కూడా కొనుగోలు చేశారు. కానీ రాను రాను వాతావరణంలో మార్పులతో పాటు సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల వేరుశనగను సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. నష్టాలు వస్తున్నప్పటికీ వేరుశనగపైన మక్కువతో సాగు విస్తీర్ణం మాత్రం తగ్గించలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని 14 పంచాయతీల్లో దాదాపు 10 వేల ఎకరాల వరకు వేరుశనగను సాగు చేశారు. ఇందులో నూలివీడు, సీసీపల్లె, పూలుకుంట, బోరెడ్డిగారిపల్లె, పందికుంట, తలముడిపి, కొర్లకుంట, గరుగుపల్లె, గుండ్లచెరువు, పేరంపల్లె, గోపనపల్లె, ఎగువ గొట్టివీడు, గోరాన్‌చెరువు, అరవీడు, గాలివీడు పంచాయతీల్లో వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేయగా వెలిగల్లు, తూముకుంట పంచాయతీల్లో కొంత మేర సాగు చేశారు. ఈ ప్రాంతంలోని నేల స్వభావాన్ని బట్టి నారాయణిరకం, లేపాక్షి, తిరుపతి, ట్యాగ్ 26, వశిష్ట, ఎర్రకాయలు వంటివి సాగు చేశారు.


గాలివీడులో ఎండిపోయిన వేరుశనగ

ఖర్చు ఎక్కువ.. దిగుబడి తక్కువ...

ప్రస్తుతం వేరుశనగ సాగుకు ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని, కానీ ఆదాయం మాత్రం రావడం లేదని రైతులు పేర్కొన్నారు. ఒక ఎకరా భూమిలో వేరుశనగను సాగు చేయడానికి 20 వేల రూపాయలకు పైబడి ఖర్చు అవుతోందని, ఇందులో విత్తనకాయలు 42 కేజీల బస్తా 3 వేలకు పైబడి ధర పెట్టి కొనుగోలు చేస్తున్నామని, దుక్కులు, ఎరువులు, కూలి, మందులు, కాయలను వలచడం వంటివి రేటు అధికమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం గింజలు భూమిలో వేసిన నాటి నుంచి వేరుశనగను తొలగించే వరకు అనేక రకాల తెగుళ్లు సోకుతున్నాయని పేర్కొన్నారు. గతంలో పంట సాగు కాలం అంతా కలిపిన ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే తెగుళ్లకు పిచికారీ చేసేవాళ్లమని కానీ నేడు నెలకు రెండు సార్లు తెగుళ్లకు పిచికారీ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒకపక్క తెగుళ్లు, మరొకపక్క తీవ్ర వర్షాభావం వల్ల పంట దిగుబడి తగ్గిపోయిందన్నారు. గతంలో ఒక ఎకరాకు 15 నుంచి 25 బస్తాలు వేరుశనగ దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది వర్షాలు లేకపోవడం వల్ల ఒక ఎకరాకు 5 నుంచి 6 బస్తాలు దిగుబడి వస్తున్నాయన్నారు. వ్యవసాయాధికారులు నిర్వహించిన పంట కోత ప్రయోగం నమోదు కూడా ఒక ఎకరాకు 5 నుంచి 6 బస్తాలు దిగుబడి వచ్చినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. పండిన కాయలకు కూడా గిట్టుబాటు ధరలేదని రైతులు పేర్కొన్నారు. ఒక ఎకరాకు 3 వేలకుపైబడి పెట్టి కొనుగోలు చేయగా రైతులు పండించిన పంటలకు మాత్రం 2 వేల రూపాయలు కూడా ధర పలకడం లేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఒక ఎకరా వేరుశనగను సాగు చేయడం వల్ల 15 వేల వరకు నష్టం వచ్చిందని, ఇలా అయితే చేసిన అప్పులు తీర్చడం కోసం ఉన్న భూములను కూడా అమ్మాలని మరికొంత మంది రైతులు తెలిపారు. మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల వేరుశనగను సాగు చేసిన రైతులు లక్షల్లో నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధిక మొత్తంలో నష్టపరిహారాన్ని రైతులకు అందించి ఆదుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు.



నూలివీడులో పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ అధికారులు

15 వేలకు పైబడి నష్టపరిహారం అందించాలి



మా కుటుంబం 5 ఎకరాల్లో వేరుశనగను సాగు చేశాము. ఒక ఎకరా వేరుశనగ సాగు చేయడానికి 20 వేలకు పైబడి ఖర్చు అయింది. దిగుబడి మాత్రం 5 బస్తాలు అయినవి. వర్షాలు లేకపోవడం వలన పంట దిగుబడి తగ్గిపోవడమే కాక కాయల నాణ్యత కూడా తగ్గిపోయింది. తద్వారా ఒక బస్తా ధర 2 వేల రూపాయలకు అమ్మాను. నాకు ఒక ఎకరాకు 10 వేలకు పైబడి నష్టం వచ్చింది. మొత్తం 5 ఎకరాలకు 60 వేలకు పైబడి నష్టపోయాము. కావున ప్రభుత్వం స్పందించి ఒక ఎకరాకు 15 వేల రూపాయలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- ఆదినారాయణ, వడ్డెపల్లె, చీమలచెరువుపల్లె

ఉపాధిని అనుసంధానం చేయాలి



ప్రస్తుతం వేరుశనగతో పాటు ఇతర పంటల సాగుకు దిగుబడి కన్నా ఖర్చు ఎక్కువ అవుతున్నది. పంట సాగుకు విత్తనాలు, ఎరువులతో పాటు కూలి రేట్లు అధికంగా ఉన్నాయి. పంటల మీద మక్కువతో అప్పులు చేసి సాగు చేస్తున్నాము. కానీ పంటలు దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాము. కావున ఎన్‌ఆర్‌ఐఈజీఎస్ పథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేస్తే రైతులకు కొంత మేర ఊరట లభిస్తుంది. తద్వారా నష్టాలను కూడా తగ్గించిన వారవుతారు.

- జనార్థన్, కొండ్రెడ్డిగారిపల్లె, నూలివీడు

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● అధికారులకు మంత్రి మండిపల్లి ఆదేశం


ప్రజా దర్బారులో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్‌లో అందిన వినతులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమ స్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజాదర్బార్‌లో అందిన అర్జీలను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

ప్రభుత్వ బడులను బతికించుకుందాం

● మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణం

మదనపల్లెఅర్బన్, నవంబరు 3:(ఆంధ్రజ్యోతి) పాలకుల విధానాల వల్ల ప్రభుత్వ బడులు నిర్వీర్యం అవుతున్నాయని, వీటిని కాపాడుకొనేందుకు యూటీఎఫ్ నిరంతరం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ, మాజీ ప్రొటెం ఛైర్మన్ విఠపు బాలసుబ్రహ్మణం పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా పేద ప్రజల పిల్లలకు చదువులు దూరం అవుతాన్నాయని అభిప్రాయపడ్డారు. ఒక ఉపాధ్యాయ సంఘం లక్ష సభ్యత్వాలతో రాష్ట్రంలో బలమైన సంఘంగా ఏర్పడి 50 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. అదే ఒరవడితో నిజాయితీ, నిబద్ధతతో కార్యకర్తలు కొనసాగి ఉద్యమించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రయోజనాలకు పనిచేస్తున్నాయే తప్ప ఉపాధ్యాయుల ప్రయోజనాలకు పనిచేయడం లేదని వాపోయారు. వేల కోట్ల బకాయిలు ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని, 13వ పీఆర్సీ ఊసేలేదని, నెలవారి ప్రమోషన్ పక్కన పెట్టారని త్వరలో ఉద్యమ కార్యాచరణ ద్వారా వీటన్నింటినీ సాధించి తీరుతామన్నారు. పూర్వ కార్యదర్శి బాబురెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఏర్పడిన అసంబద్ధతను తొలగించాలన్నారు. వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని, స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీరాజు, శ్రీనివాసులురెడ్డి, యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి జాబీర్, సహాధ్యక్షుడు హేమలత, శివారెడ్డి, ట్రెజరర్ చంద్రశేఖర్ జిల్లా నాయకులు వెంకటరమణ, సురేంద్రరెడ్డి, రమణమూర్తి, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, అక్రంబాషా, దావుద్దీన్, శ్రీనివాసులు, అంజాద్, వెంకటయ్య, హరికృష్ణ, శ్రీనప్ప, యూసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృ తాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

తిప్పనకొండలో భూమి అన్యాక్రాంతం

● పట్టించుకోని రెవెన్యూ శాఖ ● కొండను తవ్వి భూమి చదును చేసిన వైనం


శాఖరాజుపల్లి సర్వేనంబరు 175లో కొండను తవ్వేసిన ప్రాంతం

సిద్దవటం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాఖరాజుపల్లి రెవెన్యూ తిప్పనకొండ సర్వేనంబరు 175లో ఒక ఎకరా స్థలం కొండ ప్రాంతంలో కొండలు తవ్వి భూమి చదును చేశారు. బహిరంగంగా కనిపిస్తున్నా అటువైపు రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడలేదని పలు విమర్శలు వస్తున్నాయి. కొంతమంది తనకున్న డీకేటీ పొలంలో మరికొంత ప్రభుత్వ డీకేటీ రెవెన్యూ పొలాలు అన్యాక్రాంతం చేసినా రెవెన్యూ సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు కొంతమంది ఆరోపిస్తున్నారు. మండల పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో కొంతమంది రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా అవి ఏ మాత్రం అమలు కాలేదని, కొంతమంది బడా నేతలు ఇవన్నీ బయటకు రాకుండా రెవెన్యూ సిబ్బందితో మిలాఖత్ అయినట్లు ఆరోపణలు బలంగా వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల పని దినాలు, సెలవు రోజుల్లో కొంతమంది డీకేటీ రెవెన్యూ పొలంలో ఎక్సకవేటర్లు పెట్టి పనులు చేస్తున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదని మండల పరిధిలో చర్చనీయాంశంగా మారింది.

దీనిపై వీఆర్వో శివశంకర్‌ను వివరణ కోరగా.. సర్వే నెంబరు 175లో గ్రావెల్ తవ్వకాలు జరిపి భూమి చదును చేసిన విషయంపై పరిశీలిస్తానని, విధి నిర్వహణలో భాగంగా నూతనంగా బాధ్యతలు తీసుకున్నానని, రికార్డులు అన్నీ పరిశీలించి ఇలాంటి సంఘటనలు జరగకుండా తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


డీకేటీ పొలంలో ఎక్సకవేటర్, ట్రాక్టర్

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

● ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు

రాయచోటిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 11న భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం మానుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు నుంచి గతంలో దారి మళ్లించిన నిధులను బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, కోటి రూపాయలు బోర్డులో జమ చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీంబాషా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీంబాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కోశాధికారి హుస్సేన్, నరసింహులు, రమణయ్య, బాలకృష్ణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు


ఇద్దరు కుమారులతో అదృశ్యమైన ధనుశ్రీ

మదనపల్లె అర్బన్, నవంబరు 3: ఇద్దరి పిల్లలతో కలిసి మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె తాలుకా సీఐ రామచంద్ర తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణానికి చెందిన ధనుశ్రీ (32), ఇద్దరు కుమారులు డి.పార్థివ్ (10) డి.ధనుష్(8) కలిసి నవంబరు ఒకటో తేది నుంచి కనపడకుండా పోయారు. 11 ఏళ్ల క్రితం తంబళ్లపల్లెకు చెందిన ధనుశ్రీతో పీలేరు టౌన్ ఇందిర్మకాలనీకి చెందిన దేవర భార్గవ్‌కు వివాహమైంది. ధనుశ్రీ కూలీ పనులకు వెళుతుండగా, భార్గవ్ సెంట్రింగ్ పనులకు వెళుతుండేవాడు. రెండు నెలలు క్రితం వారు తమ పిల్లలతో కలిసి మదనపల్లె పట్టణం మాయాబజార్, వివేకానంద మున్సిపల్ స్కూల్ వెనుకవైపు కాపురం ఉంటున్నారు. రెండు రోజులుగా కనపడకపోవడంతో బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ధనుశ్రీ తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు ఆదివారం విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'పల్లె పండుగ' టార్గెట్ ఇదే!

● సంక్రాంతి నాటికి కొత్త వెలుగులు
● మండలానికి రూ.4.32 కోట్ల నిధులు
● 48 అభివృద్ధి పనులతో కళకళ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. గత ప్రభుత్వం తప్పిదాలను సరిచేస్తూ గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తోంది కూటమి ప్రభుత్వం. సంక్రాంతి నాటికి వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసేలా పల్లె పండుగ వారోత్సవాలను చేపట్టింది. పల్లె పండుగతో గ్రామాల్లో కొత్త వెలుగులు తేనున్నాయి. ప్రొద్దుటూరు మండల పరిధిలో రూ.4.32 కోట్ల వ్యయంతో వివిధ రకాల 48 అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. సంక్రాంతి నాటికి గ్రామాల్లో పనులు పూర్తయి కొత్త వెలుగులు చిమ్మనున్నాయి.

● గత ప్రభుత్వ హయాంలో కనీసం పల్లెల్లో రోడ్లు లేక చెరువుల్లో పూడికలు తీసే దిక్కులేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇక రోడ్లకోసం కేటాయించిన నిధులు, పంచాయతీరాజ్‌కు రావాల్సిన కేంద్ర ప్రభుత్వ సొమ్మును గత ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లించడంతో గ్రామాలు కళ కోల్పోయాయి. ఆ తప్పిదాలను సరిదిద్దుతూ గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముందుకు సాగాలనే కాన్సెప్ట్‌తో ప్రారంభమైందే ఈ పల్లె పండుగ. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, అధికారుల సమన్వయంతో ఇప్పటికే అన్ని పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు పూర్తయి లక్ష్యసాధన దిశలో ముందుకు సాగుతున్నది.

● ప్రొద్దుటూరు మండల పరిధిలో రూ.4.32 లక్షల వ్యయంతో 45 సీసీ రోడ్లు, ఒక మెటల్ రోడ్డు, రెండు కాంపౌండ్‌వాళ్ల పనులను మంజూరయ్యాయని పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. చెన్నంరాజుపల్లె పంచాయతీకి రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, కామనూరు పంచాయతీకి 74.2 లక్షలతో సీసీ రోడ్డు, పాఠశాల కాంపౌండ్ వాల్ మంజూరైనట్లు తెలిపారు.

రూ.34.2 లక్షల వ్యయంతో దొరసానిపల్లె పంచాయతీలో సీసీ రోడ్లు, రూ.22 లక్షల వ్యయంతో ఉప్పరపల్లె పంచాయతీలో సీసీ రోడ్లు, రూ.10 లక్షల వ్యయంతో కల్లూరు పంచాయతీలో సీసీ రోడ్లు, రూ.30 లక్షల వ్యయంతో తాళ్లమాపురం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు వేయనున్నారు. నంగనూరుపల్లె పంచాయతీకి రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, సీతంపల్లె పంచాయతీకి రూ.35 లక్షల వ్యయంతో రోడ్ల నిర్మాణ పనులు, చౌడూరు పంచాయతీకి రూ.15 లక్షలతో సిమెంటు రోడ్డు పనులు, చౌటపల్లె పంచాయతీలో రూ.65 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లు, మెటల్ రోడ్డు మంజూరైనట్లు చెప్పారు. పెద్దశెట్టిపల్లె పంచాయతీలో రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, శంకరాపురం గ్రామ పాఠశాలలో కాంపౌండ్ వాల్, రూ.38 లక్షల వ్యయంతో గోపవరం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, రూ.15 లక్షల వ్యయంతో కొత్తపల్లె పంచాయతీ పరిధిలో సిమెంటు రోడ్లు, రూ.27 లక్షల వ్యయంతో సోములవారిపల్లె పంచాయతీ పరిధిలో సిమెంటు రోడ్ల పనులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద ఈ పల్లె పండుగ సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 45 సిమెంటు రోడ్లు, ఒక మెటల్ రోడ్డు, రెండు పాఠశాలలకు రెండు కాంపౌండ్‌వాళ్లు అందుబాటులోకి రానున్నాయి.


అపరిశుభ్రత, గుంతల నుంచి మహర్దశ పట్టనున్న రోడ్లు

గ్రామాలకు కొత్త వెలుగు



పల్లె పండుగతో గ్రామాలు కొత్త వెలుగులతో కళకళలాడనున్నాయి. మండల పరిధిలో 48 పనులు మంజూరయ్యాయి. ఏడాది చివరి డిసెంబరు నాటికి పనులను పూర్తి చేసి సంక్రాంతికి ప్రారంభోత్సవాలు చేయనున్నాం. ఆదిశగా చర్యలు తీసుకుంటున్నాం.

- సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో

త్వరితగతిన పూర్తి చేస్తాం



మండల పరిధిలోని గ్రామ గ్రామానికి తిరిగి మంజూరైన పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చేస్తాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, అందరి సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. లక్ష్యానికంటే ముందుగానే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- డి.లక్ష్మీనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ

ప్రాథమిక విద్యకు పునరుజ్జీవం

- 117 జీవో రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- జిల్లాలో పాఠశాలలకు ఎంతో ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘు నేతలు



కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ తప్పిదంతో గాడి తప్పిన ప్రాథమిక విద్యా వ్యవ స్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం తొలి అడుగులు వేసింది. అనాలోచితంగా వైసీపీ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీవో 117ను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్ర బాబు ప్రకటించారు. దీనిపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ప్రాథమిక విద్య 1 నుంచి 5 తరగతుల వరకు ప్రతి పల్లెలో, 3 కిమీ పరిధిలో ప్రాథమికోన్నత, ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు అనతి కాలం నుంచి నడుస్తున్నాయి. కానీ విద్యాసంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నెం.117తో ప్రాథమి విద్య నిట్టనిలువునా చీలి పోయింది. విద్యాకమిషన్ లేకుండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా సబ్జెక్టు నిపుణుల బోధన ఉండాలని, ఆంగ్లవిద్యను బలోపేతం చేయాలని విలీన విధానాన్ని తీసుకువచ్చారు. కిలోమీటరు పరిధి ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు విలీనం చేశారు. అక్కడ నుంచే ప్రాథమిక విద్య విచ్ఛిన్నానికి దారి తీసింది. ఈ ప్రక్రియను నిరసిస్తూ పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులు ధర్నాలు, నిరసనలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక తమ పిల్లలను ప్రభు త్వ పాఠశాలల నుంచి దారి మళ్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రజాప్రతినిధుల పలుకుబడితో కొన్నిచోట్ల మాత్రం విలీనం ఆపగలి గారే తప్ప ప్రతి చోటా అమలులోకి వచ్చింది. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు స్కూలు అసిస్టెంటు స్థాయి ఉపాధ్యాయులు బోధించడంతో విద్యా లక్ష్యాలు ఆశించిన స్థాయిలో సాధించలేకపోవడం గమనార్హం. దీంతో తమ గ్రామం నుంచి వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో అధిక శాతం మంది విద్యార్థులు డ్రాపవుట్లుగా మారారు. క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. చివరికి ప్రాథమిక విద్య విద్యార్థుల్లో సాధించాల్సిన లక్ష్యాలు సాధించకపోవడంతో పాటు తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపడంతో ప్రభుత్వపాఠశాలల్లో ప్రాథమిక విద్యా ర్థుల సంఖ్య తగ్గిపోయింది.

450 పాఠశాలలు విలీనం

తగిన కార్యాచరణ లేకుండా, పర్యవసనాలు ఆలోచించ కుండా గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవోతో ప్రభుత్వ విద్యావ్యవస్థ నిర్వీర్యమైంది. 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తామని 3, 4, 5 తరగతులను కిలోమీటరు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీ నం చేసింది. ఈ నిర్ణయం విపరీత పరిణామాలకు దారి తీస్తుందని ఉపాధ్యాయ సంఘాలు ఎంత చెప్పినా గత వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. చివరికి ప్రాథమిక బడుల ఉనికికే ముప్పు తెచ్చింది. జీవో అమలులో భాగంగా జిల్లాలో 450 ప్రాథమిక పాఠశాల ల్లోని 3, 4, 5 తరగతుల పిల్లలను 313 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. అలాగే 407 ప్రాథమిక పాఠశాలలను 275 ఉన్నతపాఠశాలల్లో విలీనం చేయగా 40 ప్రాథమిక పాఠశాలలు 35 ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు 3 ఉన్నతపాఠశాలల్లోనూ.. మొత్తం 450 పాఠశా లలు 313 ఉన్నతపాఠశాలల్లో విలీనం చేశా రు. ఈ క్రమంలో పలు సమ స్యలు ఉత్పన్నం అయ్యాయి. నిబంధనల ప్రకారం ప్రతి తరగతికి ఒక గది ఉండాలి. ప్రతి సబ్జెక్టుకు ఒక టీచరు ఉండాలి. ఈ దిశగా చర్యలు తీసుకోకపో వడంతో గదులు లేక చాలా చోట్ల వరండాల్లో పిల్లలను కూర్చోబెట్టారు. కొన్ని చోట్ల ఒకే గదిలో రెండేసి తరగతులు కూడా నిర్వహించారు. 2022లో విలీనం ఏర్పడితే 2023 విద్యాసంవత్సరం చివరిలో పదోన్నతులు కల్పి ంచి ఉపాధ్యా యులను సర్దుబాటు చేశారు. ఈ విధంగా ఒక బ్యాచ్ విద్యార్థులకు సరైన బోధన లభించలేదని చెప్పవచ్చు.

647 ఏకోపాధ్యాయ పాఠశాలలు

ఈ జీవోతో తలెత్తిన మరో ప్రధాన సమస్య ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గిపోవడం. దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు పిల్లలను పంపేం దుకు చాలా మంది తల్లిదండ్రులు ఇష్టపడలేదు. దీంతో ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. అలా ఏటా 17 శాతం మేర ప్రవేశాలు తగ్గినట్లు సమాచారం. దీంతో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిలో తేడా వచ్చింది. నిబంధనల ప్రకారం 20 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. విద్యార్థుల సంఖ్య తగ్గ డంతో ఎక్కువ మంది ఉన్న చోటకు టీచర్లను బదిలీ చేశారు. ఈ క్రమంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగాయి. జిల్లావ్యాప్తంగా 647 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

ప్రాథమిక పాఠశాలల విలీనం రద్దు ప్రకటన హర్షణీయం



ప్రాథమికపాఠశాలల విలీనం రద్దు ప్రకటన హర్ష ణీయం. రాష్ట్రవిద్యాశాఖ పాఠశాలల విలీనం రద్దు చేస్తామని ప్రకటించడం ప్రాథమిక విద్యకు ప్రాణం పోసినట్లయింది. ప్రతి కిలో మీటరు పరిధిలో ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తర గతి వరకు నడిచేలా చర్యలు చేపట్టాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి, రాష్ట్ర అధ్యక్షుడు

ఉపాధ్యాయ సంఘాలు చెప్పినా ..



ఉపాధ్యాయ సంఘాలు ఎంత చెప్పినా వినకుండా ఉపాధ్యాయులు, మేధావుల మనోగతానికి విరుద్ధంగా గత ప్రభుత్వం తీసుకువ చ్చిన 117 జీవో ద్వారా ప్రభుత్వపాఠశాలలు కను మరుగయ్యాయి. చాలా వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయా యి. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాల్లో చదివే పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్య దూరమైంది. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ప్రాథమిక పాఠశాల లకు పూర్వవైభవం వచ్చినట్లయింది.

- ఎం.వెంకటశివారెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంది



ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు జీవో నెం.117ను రద్దు చేయడం సంతోషించదగ్గ విషయం. ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినప్ప టికీ గత ప్రభుత్వం జీవో117 అమలు చేసి ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం నిర్ణయం ద్వారా ప్రాథమిక పాఠ శాలలకు మళ్లీ పూర్వవైభవం వచ్చిందని చెప్పాలి.

- ఎ.శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

జీవో117 రద్దును స్వాగతిస్తున్నాం



నూతన జాతీయ విద్యావి ధానాన్ని అమలు చేసే సాకుతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో117ను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. జీవో 117 వల్ల ప్రభుత్వ విద్యారంగం అస్తవ్యస్తంగా తయారైంది. ఎన్నికలకు ముందు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జీవో 117ను పూర్తిగా రద్దు చేయాల్సి ఉంది.

- ఎ.విజయకుమార్, యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు


జీవో 117పై సమగ్ర సమీక్ష చేయాలి



రాష్ట్రప్రభుత్వం జీవో 117పై సమగ్ర విశ్లేషణ చేసి తగిన నిర్ణయం తీసుకో వాలి. జీవో 117ను రద్దు చేసి వచ్చేవిద్యాసంవత్సరం నుంచి క్రమంగా రాబోవు విద్యాసంవత్సరంలో 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో తరగతి వారీగా పెంచుకుంటూ వెళ్లాలి. ఇప్పుడున్న ఉన్నత పాఠశాలల్లోని 3, 4, 5 తరగతు లను అలాగే కొనసాగించాలి. అప్పుడు పదోన్నతి పొందిన స్కూలు అసిస్టెంట్ల సర్దుబాటుకు తగిన సమయం ఉంటుంది.

- కె.సురేశ్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

రేపు కొండయ్యస్వామి పుట్టినరోజు వేడుకలు



మైదుకూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మా యపల్లెలో అవధూత కొండ య్యస్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో మంగళవారం కొండయ్య స్వామి పుట్టినరోజు సంద ర్భంగా భారీ కేకును కట్‌చేసి భక్తులకు పంచిపెడతారు. రాత్రి జబర్దస్త్ టీమ్ వారిచే నవ్వుల కార్యక్రమం ఉం టుంద న్నారు. బుధవారం వృషరాజములచే బండలాగు పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతిరోజు భక్తులకు అన్నదానం ఉంటుందని కొండయ్యస్వామి శిష్య బృందం తెలిపారు.

వ్యాధుల తీవ్రతపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రపంచంలో వ్యాధుల తీవ్రతపై ఎప్పటికప్పుడు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కడప ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ జోనల్ సీఎంఈ కోఆర్డినేటరు, కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనరసమ్మ తెలిపారు. ఆదివారం కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో ఫిజి యాలజీ లెక్చర్ గ్యాలరీలో డాక్టర్ ఎన్టీఆర్‌హెల్త్ యూని వర్సిటీ ఆధ్వర్యంలో జోనల్ 3 సీఎంఈ కార్యక్రమం నిర్వ హించారు. మైక్రో బయాలజీ హెచ్‌వోడి డాక్టర్ బి.నాగ శ్రీలత పాల్గొని మాట్లాడారు. కడప ప్రభుత్వ వైద్య కళా శాల మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నాగ సుధారాణి, డాక్టర్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్‌ఫ్యాకల్టీ నియామకాలకు నేడు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైవీయూ లోని పీజీ కళాశాలలో సోమవారం గెస్ట్‌ఫ్యాకల్టీ నియా మకానికి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి ప్రకటనలో తెలిపారు. కామర్స్ సబ్జెక్టుకు గెస్ట్‌ఫ్యాకల్టీ ఎంకాం అర్హతతో పాటు పీహెచ్‌డీ నెట్ సెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. కాంపి టిషన్ డేటా సైన్స్ సబ్జెక్టుకు ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఎమ్మెస్సీ కంప్యూటరు సైన్స్, ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఎంసీఏలలో ఏదేక అర్హతతో పాటు పీహెచ్‌డీ, నెట్ సెట్ అర్హత కలిగి ఉండా లన్నారు. అభ్యర్థులు అర్హత పత్రాలతో సోమవారం ఉద యం 10గంలకు వైవీయూ క్యాంపస్ ప్రిన్సిపల్ చాంబరులో హాజరు కావాలన్నారు.

ట్యాంకు పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య



పులివెందుల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డుశేషారెడ్డి స్కూలు సమీపంలో నివాసముంటున్న బాబుల్‌రెడ్డి (35) ఆదివారం ఉదయం ట్యాంకు పైనుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం వెన్నపూసపల్లి గ్రామానికి చెందిన బాబుల్‌రెడ్డి తల్లి దండ్రులు చనిపోవడంతో మేనత్త అయిన లక్ష్మమ్మ దగ్గరే ఉంటున్నాడు. కొన్ని సంవత్సరాల కిందట తల్లిదండ్రులు చని పోవడంతో బాబుల్‌రెడ్డికి మితిస్థిమితం సరిగాలేక మానసికంగా ఇబ్బంది పడు తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పులివెందులలోని రంగనాథ గుడి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి కిందికి దూకడంతో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న ఎస్‌ఐ విష్ణు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలు సుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల సర్వజనా సుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బొలెరో వాహనం ఢీ.. యువకుడి మృతి



ప్రమాదస్థలంలో చెన్నకేశవ మృతదేహం, చెన్నకేశవ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె/గోపవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని ఎస్.సోమవరం గ్రామం బావులకాడపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నకేశవ (29) అనే యువకుడు అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గోపవరం మండలం పెద్దగోపవరం గ్రామానికి చెందిన చెన్నకేశవ వృత్తిరీత్యా బద్వేలులోని క్రిష్ణ కాంప్లెక్స్‌లో ఒక బార్బర్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఆరు నెలల పాప ఉన్నారు. చెన్నకేశవ పీలేరులో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. ఇతని మరణ వార్త వినడంతో ఆ కుటుంబం విలపి స్తోంది. ఇక మాకు దిక్కెవరని కన్నీటి పర్యంతమవుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భక వత్సలం తెలిపారు. కాగా మృతుడికి అమ్మతో పాటు మతిస్థిమితం లేని అన్న కూడా ఉన్నాడు. చెన్నకేశవ మృతితో ఆ కుటుంబానికి దిక్కులేకుండా పోయిం దని.. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జమ్మలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని దిగువపట్నం కాలనీ శివార్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... మున్సిపాలిటీ పరిధిలోని దిగువపట్నం కాలనీ శి వార్లలో 50 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఆప్రాం తవాసుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలా నికి వెళ్లి పరిశీలించారు. మృతుడు బట్టతల కలిగి.. నలుపురంగు కాటన్ ప్యాం టు, బ్లూకలర్ గల్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా పూర్తిగా పాడైపోయింది. 3 నుంచి 4 రోజుల క్రితం ఆ ప్రాంతంలో మృతదేహం ఉన్నట్లుందని.. ఎవరైనా పైన తెలిపిన ఆనవాళ్లు తెలిస్తే అర్బన్ పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



వేంపల్లె సమీపంలో బోల్తాపడ్డ సిలిండర్ల లారీ

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణ సమీ పంలోని వేంపల్లె-పులివెందుల రోడ్డులో ఎస్ఎన్ఆర్ కల్యాణ మం డపం వద్ద హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాం టి ప్రమాదం జరగలేదు. వివరాల్లోకి వెళితే.. గ్యాస్ సిలిండ ర్లను నింపుకొని అనంతపురం నుంచి లక్కిరెడ్డిపల్లెకు లారీ బయలు దేరింది. ఆదివారం వేకువజామున వేంపల్లె సమీ పంలో అదుపుతప్పి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కొన్ని సిలిండర్లు దెబ్బతిన్నాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగ లేదు. అయితే లారీలోని సిలిండర్లు దెబ్బతిన డంతో పేలుతాయేమోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది వద్ద ఇసుకను అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్న ట్లు ఆర్కేవ్యాలీ ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో ఇసుక తరలించు కోవచ్చని చెప్పడంతో పెద్దఎత్తున ఇసుకను తరలిస్తున్నారు. దీనికి తోడు ప్రస్తుతం అనుమతి లేని లారీలు, టిప్పర్లలో కూడా కొద్దిరోజులుగా పాపాఘ్నినది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు ప్రచారం ఉంది. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించగా గవిమల్లేశ్వరాలయం సమీపంలో నది వద్ద ఉన్న రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్, హిటాచిని స్వాధీనం చేసుకుని వేంపల్లె పోలీస్‌స్టేషన్‌కు అప్పగించా రు. స్వాధీనం చేసుకున్న వాహనాలను తహసీల్దార్ హరినాథరెడ్డికి అప్పగించ నున్నట్లు వేంపల్లె సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. తదుపరి చర్యలు తహసీల్దార్ తీసుకోవాల్సి ఉంది.

ఇసుకరీచ్‌లపై మొబైల్ పార్టీ దాడులు

కొండాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకరీచ్‌లపై ఆదివారం మొబైల్‌పార్టీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కడప నుంచి వచ్చిన మొబైల్ స్క్వాడ్ ఏటూ రు ఇసుకరీచ్‌ను తనిఖీ చేశారు. అక్కడ లోడింగ్ చేసిన నాలుగు ఇసుక టిప్పర్లను పరిశీలించారు. అయితే వాటికి శనివారం నాటి బిల్లులు ఉండటంతో ప్రశ్నించారు. రాత్రి కావడంతో వెళ్లలేదని టిప్పర్ల యజమానులు తెలిపారు. దీంతో ఈ టిప్పర్లపై తహసీల్దార్‌కు విచారణకు ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మొబైల్‌టీమ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



మోడెం చౌడయ్య (ఫైల్)

చిన్నమండెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన మోడెం చౌడ య్య కనిపించడం లేదని అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం... మల్లూరు గ్రామ కోడిదేపల్లికి చెం దిన మోడెం చౌడయ్య (44) వ్యవ సాయం చేసేవాడు. మంగళవారం ఉదయం 5 గంటల నుం చి కనిపించలేదని.. తమకు తెలిసిన ప్రాంతాలన్నీ వెతికినా ఆచూకీ లభించలేదని అతని భార్య మోడెం కుమారి పోలీ సులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి



ప్రొద్దుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని మడూరు క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ మహ్మద్ రఫీ వివరాల మేరకు.. చాపాడు మండలం మడూ రు గ్రామానికి చెందిన మహబూబ్ షరీఫ్(50) తినుబండా రాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంలో ప్రొద్దుటూరు నుంచి తన స్వగ్రామం మడూరుకు బయలుదేరాడు. మడూరు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా జమ్మలమడుగు వైపు నుంచి వేగంగా వస్తున్న బోలేరో వాహనం అతన్ని ఢీకొట్ట డంతో బైక్ పై నుంచి కింద పడ్డాడు. ఈ క్రమంలో తలకు బలమైన గాయాలు కావడంతో షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రఫీ తెలిపారు.

'పారిపోయిన ఖైదీది చిత్తూరు జిల్లానగరి'

కడప క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత నెల 30న ఓపెన్ జైలు నుంచి పారిపోయిన ఖైదీ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారు కాదని చిత్తూరు జిల్లాలోని నగరిప్రాంతానికి చెందిన శరవణ్ అని కడప కేంద్ర కారాగార సూపరిం టెండెంట్ రాజేశ్వర్‌రావు ప్రకటనలో తెలిపారు. జైలు నుంచి పారిపోయిన వెంటనే రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వర్క్ కేసు నమోదు చేశారని.. ఇతర రాష్ట్రాలకు చెందిన ఖైదీలను ఓపెన్ జైలుకు ఎంపిక చేయమని తెలిపారు. నింది తున్ని అరెస్టు చేసి కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

సుండుపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, ఆయన కూతురిపై అసభ్యకర పోస్టులు పెట్టడంపై జనసేన నాయకుడు రామాశ్రీనివాసులు ఆది వారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్విట్టర్ అకౌంట్‌లో అసభ్యకర పోస్టులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడి యాలో అసభ్యకర పోస్టులు చేసిన వారిని గుర్తించి వారి సోష ల్ మీడియా అకౌంట్‌తో సహా పోలీసులకు అందజే శామ న్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సు వ్యాలిడిటీ పెంపు

- నవంబరు 8 నుంచి పర్మినెంటు లైసెన్సుతోనే వ్యాపారం

పులివెందుల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సుల గడువు మరో నాలుగురోజుల పాటు పెంచుతూ ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసకుంది. తొలుత అక్టోబరు 31తో ప్రొవిజనల్ లైసెన్సుల గడువు ముగు స్తుందని.. నవంబరు 1 నుంచి పర్మినెంటు లైసెన్సు ఉంటేనే వ్యాపారం చేయా లని ప్రభుత్వం మార్గదర్శకాలు చేసింది. కానీ నిర్ణీత గడువు అక్టోబరు 30 నాటికి మద్యం షాపుల లైసెన్సుదారుల నుంచి పర్మినెంటు లైసెన్సుల కోసం పెద్దగా స్పందన లేదు. ఈ క్రమంలో ఈ నెల 7 వరకు ప్రొవిజనల్ లైసెన్సు వ్యాలిడిటీ పెంచడంతో పాటు నవంబరు 8 నుంచి పర్మినెంటు లైసెన్సు ఉంటేనే మద్యం వ్యాపారాలు చేసే వీలుంటుందని ఎక్సైజ్ శాఖ తెలిపింది.

కడప జిల్లావ్యాప్తంగా 139 మద్యం షాపులకు ప్రొవిజనల్ లైసెన్సులను అక్టోబరు 15న ఎక్సైజ్ శాఖ సదరు యజమానులకు అందించింది. తొలుత ప్రకటించిన అక్టోబరు 31 గడువు నాటికి 139 షాపుల్లో 20 మందికి కూడా పర్మినెంటు లైసెన్సు ప్రొసీజర్ పూర్తి చేయలేదని అధికారులు చెబుతున్నారు. చాలా షాపుల లోకేషన్ విషయంలో యజమానులు ఓ అంచనాకు రాకపోవడంతో బ్యాంకు గ్యారంటీలు సమర్పించ డంలో కూడా జాప్యం జరగడంతో గడువు పొడిగించారని పులివెందుల ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. పెంచిన గడువు ఉపయోగించుకుని నిర్ణీత తేదీలోగా మద్యం షాపులకు పర్మినెంటు లైసెన్సు పొందాలని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధి కారులు తెలిపారన్నారు. లోకేషన్ ఎంచుకునేటప్పుడు ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయి తనిఖీల్లో భాగంగా షాపు లోకేషన్ విషయంలో నిబంధనలు పాటించలేదని అధికారుల దృష్టికి వస్తే పర్మి నెంటు లైసెన్సు ఇవ్వడం జరగదన్నారు. దీంతో పాటు బ్యాంకు గ్యారంటీ, కౌంట రు పార్టీ అగ్రిమెంటు, షాపు లీజు, ఇతర డాక్యుమెంట్లు కూడా ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో అందించాలని, నవంబరు 7 కల్లా పర్మినెంటు లైసెన్సులు పొం దాలని మద్యంషాపుల యజమానులను ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు కోరుతున్నారు.

చిల్లర దొంగల హల్‌చల్... పలు షాపుల్లో చోరీ

కడప క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో చిల్లర దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు దొంగలు అక్కడ తాళాలు వేసిన కొన్ని షాపుల్లోకి చోరీ యత్నం చేశారు, కొన్ని షాపుల షట్టర్లను తెరిచేందుకు విఫలయత్నం చేశారు. కొన్ని షాపుల్లో దేవుని వద్ద ఉంచిన హుండీలో చిల్లర డబ్బులు చోరీ చేయగా.. కొరియర్ ఆఫీసులోకి వెళ్లి అక్కడ పార్సల్‌లో ఉన్నటువంటి టీషర్టులను వేసుకుని ఇద్దరు దొంగలు గొడవ పడ్డ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అయితే రెండుషాపుల్లో దాదాపు రెండువేలకు పైగా నగదు దొంగలు అపహరించినట్లు తాలుకాసీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా ఇప్పటి వరకు బాధితులు ఫిర్యాదు చేయలేదని, వారు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారిస్తామన్నారు. కాగా పోలీసులు ఒక దొంగను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది.

నలుగురు జూదరుల అరెస్టు

ఒంటిమిట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, రూ.11,400 స్వాధీనం చేసుఉకున్నట్టు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. మండలంలోని కొన్నకొత్తపల్లిలో పేకాట సమా చారం అందడంతో ఆదివారం దాడులు నిర్వహించామన్నారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

యువకుడిపై దాడి: పాతకక్షల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వినాయక చవితి సందర్భంగా ఏర్పడిన మనస్పర్థలను మనసులో ఉంచుకుని బాలాజీతోపాటు మరో ఇద్దరు యువకులు ఆదివారం రాత్రి మండల కేంద్రంలో నితిన్ అనే యువకుడిపై దాడి చేశారు. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మదనపల్లెలో రోడ్ల విస్తరణకు శ్రీకారం

- నేలకొరుగుతున్న వందేళ్ల చింతవృక్షాలు
- పదిహేనేళ్ల తర్వాత మళ్లీ తెరపైకి విస్తరణ
- ఆక్రమణలు తొలగేనా..ట్రాఫిక్ తీరేనా..?



రోడ్డు విస్తరణకు ముందు సీటీఎం రోడ్డులో వున్న చింతవృక్షాలు



సీటీఎం రోడ్డులో చింతచెట్లను తొలగిస్తున్న కార్మికులు

మదనపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని సీటీఎం రోడ్డులో గల వందేళ్ల చింతవృక్షాలు నేలకొరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పేరుతో వీటిని తొలగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, దీనికి పరిష్కారానికి రోడ్లు వెడల్పు చేయడమే మార్గమని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా చెబుతున్నారు. ఇందులో భాగంగా ఎక్కడ సభలు, సమావేశాల్లో పాల్గొన్నా..ట్రాఫిక్ సమస్యను ప్రస్తావిస్తూ, సమస్య పరిష్కారానికి సహకరించాలని అటు ప్రజలు, ఇటు వాహనదారులను కోరుతున్నారు. ఇందులో భాగంగా రెండురోజుల క్రితం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ట్రాఫిక్ సమస్యను వివరిస్తూ, ఎక్కడెక్కడ సమస్య ఉందో పట్టణంలో కలెక్టర్‌తో కలసి పట్టణంలో పర్యటించారు. ఇందులో భాగంగా కదిరి రోడ్డు, బెంగళూరు బస్టాండు, సీటీఎం రోడ్డు, గాంధీరోడ్డు ఏరియాలలో పర్యటించి పట్టణవాసులకు ఎదురువుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ఏకరువు పెట్టారు. దీనికి పరిష్కారంలో భాగంగా రోడ్ల విస్తరణే శరణ్యమని భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, అటవీ, రోడ్లు, భవనాల శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదించినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం మొదట సీటీఎం రోడ్డులో రోడ్డు పక్కనున్న చింత చెట్లను తొలగిస్తున్నారు. కార్మికులు యంత్రాలు, మిషన్లతో కొమ్మలను తొలగించగా, భారీ క్రేన్‌తో వాటిని పక్కన పడేసే పనులు చేపట్టారు. ఇందుకోసం పాత ఎమర్జెన్సీ హాస్పిటల్ వద్ద, ఇటు బర్మావీధిక్రాస్‌లో ట్రాఫిక్‌ను మళ్లించారు. సోమవారం ఉదయం కూడా పెద్దమొత్తంలో వర్కర్లను పెట్టి చెట్లను తొలగించనున్నట్లు చెబుతున్నారు. నిజంగా సీటీఎం రోడ్డులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలంటే చింతవృక్షాలను మధ్యలో వదిలేసి రోడ్డుకు అటు, ఇటు ఉన్న ఆక్రమణలు తొలగిస్తే సరిపోతుంది. అలా కాకుండా ఆఫీసర్స్ క్లబ్ నుంచి చిత్తూరు బస్టాండు సర్కిల్ వరకూ ఉన్న 27-30 భారీ చింత వృక్షాలను తొలగించాల్సి వస్తోంది. పదిహేనేళ్ల క్రితం కూడా రోడ్డు విస్తరణ చేయాలని అప్పటి పాలకులు భావించినా.. స్థానికుల అభ్యంతరాలు, కొందరు న్యాయస్థానానికి వెళ్లడంతో విస్తరణకు బ్రేక్ పడింది. రోడ్డు పక్కనున్న ఆక్రమణలను తొలగిస్తే తమకు అభ్యంతరం లేదని, పర్యావరణంతో పాటు పట్టణవాసులకు నీడనిస్తున్న చింతవృక్షాలను తొలగించడంపైనే స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



బర్మావీధిలో ట్రాఫిక్‌ను మళ్లించడంతో నిలిచిపోయిన వాహనాలు

మహిళా సాధికారతకు పెద్దపీట



జన జాగృతి సేవా సమతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు 3:(ఆంధ్రజ్యోతి) మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సేవలు అమోఘమని స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కృష్ణానగర్‌లో అడ్వకేట్ బాలజ్యోతి ఆధ్వర్యంలో జన సాగృతి సేవా సమితి లోగో ప్రారంభోత్స కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరయ్యారు. తొలుత మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె అభివృద్ధికి పెద్దపీట వేసి గ్రీన్ సిటీగా తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోర్డు సంస్థ నిర్వాహకురాలు లలితమ్మ, హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి, చైతన్య సేవా సంస్థ ఆనందనన్, జనసేన నాయ కురాలు దారం అనిత, జేసీబీ వేణు, జేసీబీ మధు, వెంకటేష్, గురుయాదవ్, వెంకటేస్, అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

- జడ్పీ హై స్కూల్‌కు పది సిమెంట్ బల్లలు వితరణ



జడ్పీ హైస్కూల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మదనపల్లె అర్బన్ నవంబరు3:(ఆంధ్రజ్యోతి) స్థానిక జడ్పీ హైస్కూల్‌లో యాభైఏళ్ల తరువాత 1973-74లో పదో తరగతి చదువు కొన్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. అందరూ కలిసి మెలిసి రోజంతా సంతోషంగా తమ తీపిగుర్తులను నెమరు వేసుకున్నారు. కలిసి ఫొటోలు దిగారు. ఎక్కడో స్థిరపడిన పాత మిత్రులను కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఆనాటి తమ క్లాసులను. తాము చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అందరూ కలిస సహపంక్తి భోజనాలు చేశారు. తమ గుర్తుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పది సిమెంట్ బల్లలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మురళి, శివప్రసాద్, అశోక్‌రెడ్డి, నరసింహులు, గిరిధర్, వాసు, విజయలక్ష్మీ, లక్ష్మీపతి, సికింధర్, జయచంద్రలు పాల్గొన్నారు. వారికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలమయం.. ఝరి రోడ్డు

- మట్టి కోసుకు పోయి, కంకర బయట పడి వాహనదారుల ఇక్కట్లు
- అవస్థల్లో పలుగ్రామాల ప్రజలు



ఝరి మార్గంలో కోసుకుపోయిన రోడ్డు

కలకడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రయ్యగారిపల్లె ఆర్చి నుంచి పలు గ్రామల మీదుగా ఝరి వరకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారింది. ఐదు కిలో మీటర్లు దూరం ఉన్న ఈ రహదారిపై సుమారు దశాబ్దం క్రితం ప్రభుత్వం తారురోడ్డును నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. అయితే ప్రస్తుతం రోడ్డుపై గుంతలు పడడమే కాక వర్షాలకు అందులో నీరు నిలుస్తున్నాయి. అదేవిధంగా ఇరువైపులా మట్టి కోసుకపోయి కంకర బయట పడింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం చేసే ప్రజలు అవస్థలు పడుతున్నారు. అంతేకాక వాహనాల రాకపోకలకు దుమ్ము లేచి విపరీతంగా అలుముకుంటుండంతో ప్రమాదాలు జరిగే అవకాశం వుంది. కారణంగా ఈ ఏడాది జరిగిన ఝరి ఉత్సవానికి హాజరైన వేలాది మంది భక్తులు ఇబ్బందిపడ్డారు. అంతేకాక ఈమార్గం కేవీపల్లె, సుండుపల్లె మండలాల్లోని పలు గ్రామాలకు సౌకర్యంగా ఉన్నందున ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ కార్తీకమాసంలో ఝరిలో లక్షదీపోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా పూజలకు అక్కడికి భక్తులు తరలి వెళతారు. సంబంధింత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టడంతోపాటు భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



ఈ మార్గం బాగా దెబ్బతినడంతో ప్రయాణ సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. మా ఊరి నుంచి పనుల నిమిత్తం నిత్యం ఏదో ఓ సమయంలో కలకడకు వెళ్లాల్సి వస్తుంది. ఎదురుగా వాహనాలు వస్తే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిందే. సమస్య కనబడుతున్న ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ద్విచక్రవాహనదారుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి ఝరి రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రజలకు సౌకర్యవంతంగా మార్చాలి.
-సుధాకర్, తువ్వపల్లి,
కేవీపల్లె మండలం

కాట్వా పీలేరు అధ్యక్షుడిగా పోతంశెట్టి సుధాకర్‌బాబు

పీలేరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ అసోసియేషన్ పీలేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పోతంశెట్టి సుధాకర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం పీలేరు మెయిన్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ కాట్వ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శిగా వసుపులేటి శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శిగా సుధాకర్, గౌరవాధ్యక్షుడిగా ఎర్రంశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పుష్పలత, శ్రీనివాసుల త్రినాథ్‌రావు, ఉదయకుమార్‌లను ఎన్నుకున్నారు.

రేపు వాలీబాల్ అండర్-14 బాలబాలికల జట్ల ఎంపికలు

మదనపల్లె అర్బన్, నవంబరు 3:(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వాలీబాల్ అండర్- 14 బాల బాలికల ఉమ్మడి చిత్తూరు జిల్లా స్పోర్ట్స్ సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు సెక్రటరీ వసంతవాణి, తిరుపతి జిల్లా సెక్రటరీ ఎస్, బాబు, అన్నమయ్యజిల్లా సెక్రటరీ వసంత తెలిపారు. అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు మంగళవారం ఉదయం 10 గంటలకు సెలెక్షన్స్‌కు హాజరు కావాలని కోరారు. అలాగే అండర్ బాల బాలికల రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 6,7 తేదీల్లో ములకచెరువులో నిర్వహిస్తునట్లు అన్నమయ్య జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ వసంత తెలిపారు. అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతారని ఆమె తెలిపారు.

వాల్మీకిపురంలో ఎమ్మెల్యే కిశోర్ పర్యటన

వాల్మీకిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):వాల్మీకిపురం మండలంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం, అనంతరం మండల స్థాయి ప్రభుత్వ అధికారులతో సమీక్షా సమావేశాలు జరుగుతాయన్నారు.

తంబళ్లపల్లె అభివృద్ధికి సహాయమందించండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరిన జయచంద్రారెడ్డి





జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్ధన్‌రెడ్డిని కలిసిన టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, తంబళ్లపల్లె నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి

ములకలచెరువు/కురబలకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజక వర్గ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి కోరారు. ఆదివారం రాయచోటిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసి సమస్యలపై విన్నవించారు. నియోజకర్గంలో పరిశ్రమలను, ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు గొడ్డావుల రమణ, కాలేషా ఉన్నారు. అలాగే జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని ఆది వారం రాయచోటిలో టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ తదితరులు కలిశారు. ఇన్‌ఛార్జ్ మంత్రిగా తొలిసారిగా జిల్లాలో పర్యటించడంతో ఆయనను పలువురు బీసీ నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. అయనను కలిసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వడంతో పాటుగా వారికి అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా దృష్టి సారిస్తానన్నారు. అనంతరం ఆయనను నియోజకవర్గంలో పర్యటించాలని కోరగా, త్వరలోనే పర్యటిస్తామని హామీ ఇచ్చారు.

మదనపల్లె- కొనంగివారిపల్లె మధ్య బస్సు పునరుద్ధరణ



బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

కురబలకోట, నవంబరు 3: మదనపల్లె- కొనంగివారిపల్లె మధ్య ఆర్టీసీ బస్సును టీడీపీ నియోజకవర్గనేత జయచంద్రారెడ్డి, టీడీపీ నేత రుద్ర బాలకృష్ణలు తిరిగి ప్రారంభించారు. మదనపల్లె నుంచి ముదివేడు, ఆర్చి కురవపల్లె, మట్లివారిపల్లె, ఎర్రమద్ది వారిపల్లె మీదగా గతంలో బస్సు నడేచేది. కాగా బస్సును గత ప్రభుత్వ హయాంలో రద్దు చేశారు. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే టిడీపీ నియోజకవర్గ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి, మరో నేత రుద్ర బాలకృష్ణలు మంత్రి రాంప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి బస్సు తిరిగి పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సును ఆదివారం ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం ఆ బస్సును పునరుద్ధరించడంతో టీడీపీ నేతలకు ఆర్చి కురవపల్లెలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. కాగా బస్సు ఈ మార్గాన తిరిగి రావడంతో ప్రజలు హర్షం చేశారు.

ఆల్గేన్ ఎలక్ట్రానిక్స్ సంస్థతో మిట్స్ ఎంవోయూ



ఆల్గేన్ ఎలక్ట్రానిక్స్‌తో ఎంవోయూ కుదుర్చుకుంటున్న కళాశాల విభాగాధిపతి అరుళ్‌కుమార్

కురబలకోట, నవంబరు 3: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం తమిళనాడుకు చెందిన ఆల్గేన్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. ఆదివారం కళాశాలలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో విభాగాధిపతి అరుళ్‌కుమార్ ఆ సంస్థ డైరెక్టర్ చిత్రాలు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో, ఇంటర్నషిప్‌లు, ప్లేస్‌మెంట్, అందించడంతో పాటుగా అవగాహన కార్యక్రమాలలో సహాయసహకారాలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు ఉమ్మడి మార్గదర్శకత్వంలో ప్రాజెక్ట్‌లు, పరిశోధనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా విద్యార్థులకు మరింతగా ఉద్యోగావకాశాలు దక్కనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య సంఘం కార్తీక వన మహోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాశ్

మదనపల్లె అర్బన్, నవంబరు 3:(ఆంధ్రజ్యోతి) మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాస్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకమాస వనవిహార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే బోయకొండ వద్ద గల ఆర్యవైశ్య సంఘంతోటలో ధాత్రి పూజ నిర్వహించారు.అనంతరం ఆర్యవైశ్య మహిళా సంఘాలు, ఆర్యవైశ్యులు కలిసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం ప్రారంభంలోనే వనవిహార మహోత్స కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉండడంతో ఎక్కడో ఉద్యోగ రీత్యా, వ్యాపారం పరంగా స్థిరపడినప్పటికి ఈ కార్యక్రమంలో కలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి సూరేగిరిధర్, ఎగ్జిక్యూటివ్ మెంబరు పొనగంటి అమరనాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, నవీన్, రాజేష్, మెడికల్ సత్యనారాయణ, వెంకటేష్, సూర్యనారాయణ, ప్రదీప్,, మహిళా సంఘం నాయకురాళ్లు, పాల్గొన్నారు.

రామసముద్రం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ



రామసముద్రం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ రమేష్

రామసముద్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం సీఐ కె.రమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, రౌడీయిజం ప్రోత్సహించిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ సిబ్బంది ముందుంటారన్నారు. మండలంలోని కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్టులలో అక్రమ మద్యం నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ రమేష్‌తో పాటు ఎస్ఐ వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై నిఘా ఉంచండి

గుర్రంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐ మధురామచంద్రుడు సిబ్బందికి సూచించారు. స్టేషన్‌లో ఆదివారం సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రౌడీ షీటర్లపై ఆయా గ్రామ పోలీస్ అధికారి నిఘా ఉంచాలన్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించిన వివరాలను తెలపాలన్నారు. అలాగే నాటుసారా, బెల్టు షాపు నిర్వహిస్తున్న వారి వివరాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు నైపుణ్యతపై శిక్షణ

కలికిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు నైపుణ్యత మెరుగుపరుచుకోవడానికి ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో భానుమూర్తి రావు తెలిపారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండు విడతలుగా ఈ శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 11 గంటలకు ఒక బ్యాచ్‌కు మధ్యాహ్నం 2 గంటలకు మరో బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. ఉదయం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలలీసులు, వ్యవసాయ సహాయకులు, ఇంధన సహాయకులకు, మధ్యాహ్నం డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, సర్వేయర్లు, ఏఎన్ఎంలకు ఈ శిక్షణ వుంటుందన్నారు. శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన టీవోటీలకు శిక్షణ పూర్తి చేసి సిద్ధం చేసినట్లు చెప్పారు. మండలంలోని అన్ని సచివాలయాలకు చెందిన ఉద్యోగులు తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలని ఎంపీడీవో ఆదేశించారు. లేదంటే శాఖాపరమైన చర్యలకు గురవుతారని హెచ్చరించారు.